RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 40 పేజీలు - 08 బుధవారం 07 జనవరి 2026

## హైదరాబాద్‌లో ఈగిల్ టీమ్ దాడులు

● 10 కిలోల గంజాయిని స్వాధీనం

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 6 :** డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసులు చర్యలు చేపడుతున్నప్పటికీ తరచూ ఎక్కడో ఒకచోట డ్రగ్స్ కలకలం రేపుతూనే ఉన్నాయి. పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ కట్టడి చేస్తున్నప్పటికీ హైదరాబాద్ లో డ్రగ్స్ దందాకు అడ్డుకట్ట పడటం లేదు. హైదరాబాద్ లో ఈగల్ ఫోర్స్, ఎస్ఆర్ నగర్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. నేచర్ క్యూర్ హాస్పిటల్ రైల్వే స్టేషన్ దగ్గర రూ. ఐదు లక్షల విలువజేసే 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు డ్రగ్స్ సప్లై చేస్తున్న మైనర్ ను అరెస్ట్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న మైనర్ బాలుడు ముంబై డ్రగ్ సిండికేటర్లకు డ్రగ్ ట్రాన్స్పోర్టర్ గా పని చేస్తున్నట్లు గుర్తించారు పోలీసులు. ఆర్థికంగా బలహీనుడైన బాలుడిని వినియోగించుకొని ముంబై ముఠా డ్రగ్స్ దందా చేస్తున్నట్లు తెలిపారు పోలీసులు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తుండగా పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించిన పోలీసులు మైనర్ ను అదుపులోకి తీసుకున్నారు. 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని మైనర్ ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతన్ని ఎస్ఆర్ నగర్ పోలీసులకు అప్పగించారు. ఆఖా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు ఎస్ఆర్ నగర్ పోలీసులు.



## ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

శ్వాసకోస సంబంధ సమస్యలతో చేరిక

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 6 :** కాంగ్రెస్ పార్లమెం టరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. సోనియాగాంధీ తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమెను వైద్యులు పర్యవేక్షణలో ఉంచారు. ఆస్పత్రి వర్గాల సమాచారం ప్రకారం.. సోనియా గాంధీకి సీనియర్ పల్మనాలజిస్ట్ పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య మిగతా2లో...

## 10 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు

- తెలంగాణ ప్రభుత్వం ప్రకటన




**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 6 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ప్రకటించింది. జనవరి 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అన్ని పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ సెలవులు ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య పాఠశాలలకు వర్తిస్తాయని పేర్కొంది. జనవరి 16వ తేదీన కనుమ రోజును పురస్కరించుకుని ఐచ్ఛిక సెలవు కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కనుమ రోజున రైతులు తమ పండుగను ప్రత్యేకంగా చేసుకుంటారు. కనుమ రోజున ఉత్సవాలు, పండుగ సంబరాలు జరుపుకోవడం మిగతా2లో...

# ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

### ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల పెంపునకు చర్యలు

### అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 6 :** ఈవి వాహనాల బ్యాటరీల సామర్థ్యం పెంపునకు కంపెనీలు చర్యలు చేపట్టాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈవి పాలసీ కింద తయారీదారులు, డీలర్లతో భేటీ ఏర్పాటు చేశామని అన్నారు. ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెంపునకు చర్యలు ఉంటాయన్నారు. మంగళవారం శాసనసభలో పొన్నం మాట్లాడుతూ.. ఈవీ వాహనాల రాయితీ అమలుతో రూ.900 కోట్ల పన్ను నష్టం అని.. ఉద్యోగులు ఈవి వాహనాలు కొనుగోలు చేస్తే 20 శాతం తగ్గింపు ఉంటుందని పొన్నం తెలియజేశారు. ఉద్యోగులకు 20 శాతం వరకు తగ్గించాలని కంపెనీలను కోరామని అన్నారు. ఎంఎన్ సి కంపెనీలు ఈవి వాహనాలు కొనుగోలు చేసేలా విధానం ఉంటుందని, పిఎం ఈ డ్రైవ్ కింద 575 ఆర్టిసి బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. కొత్తగా 200కు పైగా ఈవి బస్సులు వస్తున్నాయని, వరంగల్ లో 100, నిజామాబాద్ లో 50 బస్సులు వస్తున్నాయని పేర్కొన్నారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్క్రాప్ చేయాలని, స్క్రాప్ పాలసీ కింద ప్రోత్సాహం ఇచ్చేలా జివో మిగతా2లో...


## కేసీఆర్ చెప్పు ధూళికి కూడా సరితూగని రేవంత్


● తెలంగాణ తెచ్చిన మొనగాడు కెసిఆర్ ● రేవంత్ మాత్రం రియల్ బ్రోకర్

● సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్



**తొలి అక్షరం/జనగామ,అక్టోబర్ 6 :** సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పు ధూళికి కూడా సరితూగడని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం జనగామలో బీఆర్ఎస్ తరపున గెలిచిన సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన .. సీఎం రేవంత్‌రెడ్డిపైన, కాంగ్రెస్ ప్రభుత్వంపైన విమర్శల వర్షం గుప్పించారు. తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్ అని, అందుకే ఆయన తన తండ్రి అని గర్వంగా చెప్పుకుంటానని కేటీఆర్ అన్నారు. అలాంటి మొనగాడిని సవాలు చేస్తున్న రేవంత్ రెడ్డి అనేటోడు ఆయన చెప్పు ధూళికి కూడా సరిపోడని వ్యాఖ్యానించారు. మిగతా2లో...





## అశాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటు

- అసెంబ్లీలో చర్చించి సరిచేస్తామన్న పొంగులేటి

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 6 :** తెలంగాణలో గత ప్రభుత్వం జిల్లాలు, మండలాలను అశాస్త్రీయంగా, అసంబద్ధంగా రూపొందించిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనిని సవరించాల్సి ఉందన్నారు. అసెంబ్లీ లో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడుతూ..మ్యాజిక్ ఫిగర్ కోసమే రాష్ట్రంలో మండలాలు మిగతా2లో...

## 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

● అందుకు అనుగుణంగా పెట్టుబడులకు ప్రోత్సాహం

● మండలిలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 6 :** తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలనే దృఢమైన సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శాసనమండలిలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులకు సులువుగా ఉండే విధంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని తీసుకొచ్చా మన్నారు. తెలంగాణ రైజింగ్ సదస్సులో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఈనెల 19న మరోసారి వరల్డ్ ఎకనమిక్ సమిట్‌కు వెళు తున్నామని, భారీగా పెట్టుబడులు తీసుకొస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. హ్యూసెంట్రియో, సిస్టా ఐటీ సంస్థల ద్వారా వెయ్యి చొప్పున ఉద్యోగాలు వస్తాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. జాబ్ క్యాలెండర్ విషయంలో మిగతా2లో...



## సింగరేణిలో త్వరలో క్యాథ్ ల్యాబ్: భట్టి

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 6 :** సింగరేణి కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభిస్తామని చెప్పారు. సింగరేణిపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 32మంది వైద్యుల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలో భర్తీ చేస్తాం. 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక పక్రియ జరుగుతోంది. సింగరేణి ఆస్పత్రుల్లో మార్చి నాటికి వైద్యులు,

మిగతా2లో...

## బ్లో ఔట్ వద్ద అదుపులో మంటలు

95శాతం అదుపులో ఉన్నట్లు వెల్లడి

నిరంతరం నీటిని చిమ్మే ప్రయత్నం

అదుపులోకి రావడానికి మరో ఐదురోజులు

ఓఎన్‌జిసి అధికారుల వెల్లడి



**తొలి అక్షరం/అంబేద్కర్ కోనసీమ,అక్టోబర్ 6 :** ఇరుసు మండ బ్లోఔట్‌లో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకు వచ్చేందుకు ఓఎన్‌జీసీ సిబ్బంది శాయశక్తుల కృషి చేస్తున్నారు. దీనిపై డీప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నిర్వహిస్తున్న మోరి - 5 వెల్ ఫీల్డ్‌పై ఓఎన్‌జీసీ తాజాగా ప్రకటన విడుదల మిగతా2లో...



## తీవ్రం అవుతున్న పిచ్చికుక్కల బెడద

- భైంసాలో ఒక్కరోజే 50 మందిపై దాడి

**తొలి అక్షరం/నిర్మల్, 6 :** కుక్కల స్వైర విహారంతో జనం బెంబేలెత్తి పోతున్నారు. అవి దాడి చేసినప్పుడు హడావిడి చేస్తున్న అధికారులు తరవాత మరిచి పోతు న్నారు. గ్రామం నుంచి పట్టణం వరకు కుక్కల బెడద తీవ్రం అవుతు న్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తాజా నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఓ పిచ్చి కుక్క బీభత్సం

మిగతా2లో...

## వరంగల్ కోట భూ ఆక్రమణలు తొలగించండి

### కోట తెలంగాణ వారసత్వ సంపద

### సిఎం రేవంత్‌రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,అక్టోబర్ 6 :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా వరంగల్ కోట భూములను భారత పురావస్తుశాఖకు చెందినవిగా గుర్తించాలని సూచించారు. కోట భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కోట భూముల్లోని ఆక్రమణదారులను తొలగించ డం గురించి ఈ లేఖలో ప్రస్తావించారు. దాదాపు 250 సంవత్సరాలపాటు కాకతీ యుల రాజధానిగా కీర్తిగడించి ఘనమైన చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక వైభవంతో అలరారిన ఓరుగల్లు పట్టణం.. తెలంగాణ వారసత్వ సంపదకు మిగతా2లో...

# బ్లో ఔట్ వద్ద అదుపులో మంటలు

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. న్యూఢిల్లీకి చెందిన డైరెక్టర్ విక్రమ్ సక్సెనాతో సహా ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ సీనియర్ మేనేజ్‌మెంట్, క్రైసిస్ మేనేజ్‌మెంట్ టీమ్ నిపుణులతో కలిసి ఈ మంటలను నియంత్రించేందుకు కార్యాచరణ చేపట్టినట్లు వివరించింది. అధిక సామర్థ్యం ఉన్న వాటర్ పంపులను వినియోగించి.. సమీపంలోని నీటిపారుదల వనరుల నుండి తాత్కాలిక కాలువను రూపొందించడానికి పనులు చేపట్టినట్లు తెలిపింది. అందుకోసం సమగ్ర బ్లో అవుట్ నియంత్రణ ప్రణాళికను ఖరారు చేసినట్లు పేర్కొంది. అగ్నికీలల తీవ్రతను తగ్గించేందుకు నిపుణుల బృందం పని చేస్తోందని తెలిపింది. 600 మీటర్ల వ్యాసార్ధంలో పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి గాలి నాణ్యత, శబ్ద స్థాయిలను బృందం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని ఓఎన్‌జీసీ వెల్లడించింది. ఇంకోవైపు ఈ మంటలను గూడవల్లి పంట కాల్వ నుంచి పైపుల ద్వారా నీటిని మళ్లించి మంటలను అదుపుచేస్తున్నారు. రాజమండ్రి, నర్సాపురంలోని ఓఎన్‌జీసీ బృందాలు రంగంలోకి దిగాయి. బావిలో నుంచి ఒత్తిడి తగ్గించేందుకు తమ వంతు ప్రయత్నాలను ఓఎన్‌జీసీ బృందం ముమ్మరం చేసింది. ఎగసిపడుతున్న అగ్నికీలలు కొంత మేర తగ్గాయని అధికారులు వివరిస్తున్నారు. మరోవైపు న్యూఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం.. బ్లోఔట్ ప్రదేశానికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నిస్తోంది. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాతే.. ఈ ఘటన ఎలా జరిగింది? ఎవరు బాధ్యులనే అంశంపై చర్యలు చేపట్టనున్నారు. బ్లోఅవుట్ ప్రమాదంపై జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఓఎన్జీసీ టెక్నికల్ డైరెక్టర్ విక్రమ్ సక్సేనా సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో బ్లోఅవుట్ కట్టడి చర్యలు, భద్రతా పరిస్థితులపై స్పష్టత ఇచ్చారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమలోని గ్యాస్ బ్లోఅవుట్ మరో ఐదు రోజులు పాటు కొనసాగే అవకాశం ఉందన్నారు. అయితే ఇప్పటికే 95 శాతం బ్లోఅవుట్‌ను విజయవంతంగా కట్టడి చేశామని, మిగిలిన గ్యాస్‌ను క్యాపింగ్ చేసేందుకు మరికొంత సమయం పడుతుందన్నారు..అయితే, బ్లోఅవుట్ కొనసాగినా ఎలాంటి ప్రాణహాని, ప్రమాదం ఉండదని, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని విక్రమ్ సక్సేనా తెలిపారు. గ్యాస్ లీక్ ప్రాంతంలో ప్రస్తుతం వాటర్ అంబ్రెల్లా భద్రతా విధానం అమలు చేస్తున్నామని, ఐదు వైపులా నిరంతరం నీరు చిమ్ముతూ మంటలు చెలరేగకుండా నియంత్రణ చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. భూభాగంలో మిగిలిన గ్యాస్‌ను పూర్తిగా నియంత్రించేందుకు రోజుకు అనేక టెక్నికల్ పరిశీలనలు, నిపుణుల సూచనలతో క్యాపింగ్ పక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇక, ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ఒక్క ప్రాణి కూడా ప్రమాదానికి గురికాలేదని అధికారులు ధృవీకరించారు. బ్లోఅవుట్ కారణంగా కాలిపోయిన కొబ్బరి చెట్లు, దెబ్బతిన్న పంట భూములకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, మరో ఏడు రోజులు పాటు ఐదు వైపులా నీటిని చిమ్మే రక్షణ చర్యలు కొనసాగుతాయని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. బ్లోఅవుట్ పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు జిల్లా యంత్రాంగం, ఓఎన్జీసీ నిపుణులు, కేంద్ర,రాష్ట్ర విభాగాలు నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తాయని వెల్లడించారు. ప్రస్తుతం 95శాతం కట్టడి కావడంతో ప్రమాద తీవ్రత గణనీయంగా తగ్గిందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు అధికారులు.

# ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకువచ్చామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఈవీ పాలసీని తీసుకువచ్చామని, ఈ ఏడాది కాలంలో లక్ష ఈవీ వాహనాలు అమ్ముడయ్యాయని వెల్లడించారు. కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్రం సబ్సిడీ ఇస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అలా ఇస్తోందా? అని ప్రశ్నించారు. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈవీలను తక్కువగా వినియోగిస్తున్నారు. రాష్ట్రం మొత్తంపై ఆ తరహా వాహనాలు 70 వేలే నడుస్తున్నాయి. కాలుష్యం తగ్గాలంటే ఈ సంఖ్య పెరగాలి. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలి. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మీద కేంద్రం సబ్సిడీ ఇస్తుంది.. తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల మీద సబ్సిడీ ఇస్తుందా? కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో 40శాతం మాత్రమే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఉందని తెలిపారు. ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వాహనాలను వాడటం లేదని.. తెలంగాణలో 70 వేల ఎలక్ట్రిక్ వాహనాలే నడుస్తున్నాయని వెల్లడించారు. పొల్యూషన్ తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలి.. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ.. ప్రోత్సహించాలని కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలని తెలిపారు. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలని చెప్పారు. త్రీ వీలర్, ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రమోట్ చేయాలని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. 'హైదరాబాద్‌ను పొల్యూషన్ ఫ్రీ చేయాలంటే.. ఎలక్ట్రిక్ వాహనాలను వాడాలి.. ఎలక్ట్రిక్, సోలార్ ప్యానెల్ తో నడిచే వాహనాలను ప్రోత్సహించాలి.. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలంటే పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలి.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.. ఇవీ పాలసీని తీసుకుని వస్తున్నందుకు ధన్యవాదాలు' అని ఎమ్మెల్యే వెల్లడించారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలంటే ఈవీలను వాడాలని చెప్పారు. వినియోగం పెరిగేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలని.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీ పాలసీ తీసుకొస్తున్నందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# కేసీఆర్ చెప్ప ధూళికి కూడా సరితూగని రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్ పెడితేనే రేవంత్ రెడ్డి ఆగమాగం అయితున్నడని, ఆయన అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే అక్కడే గుండె ఆగి సస్తడని అన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధిద్దామని ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్న ఆలోచనతోనే ఓటు వేసి ఆయనను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన ప్రతి ఒక్క సర్పంచి మున్సిపల్ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని కోరారు. వరంగల్ జిల్లాలో సర్పంచులు పెద్ద సంఖ్యలో గెలిచారని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడ్డా, ఒత్తిళ్లకు గురిచేసినా పార్టీ కోసం నిలబడ్డారని ప్రశంసించారు. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి ధన్యవాదాలు చెప్పారు. జనగామ ర్యాలీ చూస్తే 'కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు' అనిపించిందని అన్నారు. ప్రజలు గులాబీ జెండాను చూడగానే చప్పట్లు కొడుతుంటే సంతోషం అనిపించిందని, కాళోజీ మాటలు గుర్తొచ్చాయని అన్నారు. కేసీఆర్ ఎప్పుడు ముఖ్యమంత్రి అయితారా అని ప్రజలు కసితో ఎదురుచూస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ఏ పాత్ర లేకున్నా అన్ని పదవులు ఇచ్చిన పార్టీని వదిలి కడియం శ్రీహరి సీఎం రేవంత్ రెడ్డితో కలిశాడని విమర్శించారు. ఇక్కడి నిబద్ధత కలిగిన కార్యకర్తలు బీఆర్ఎస్ బలపర్చిన 150 మంది సర్పంచులను గెలిపించారని మెచ్చుకున్నారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, రాణి రుద్రమదేవి పుట్టిన గడ్డ ఇదని కేటీఆర్ కీర్తించారు. సీఎం రేవంత్‌రెడ్డిపైన, రాష్ట్ర ప్రభుత్వంపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి పాలన చేతగాక బీఆర్ఎస్ మీద నిందలు వేస్తున్నాడని ఆరోపించారు. ఏదో అడ్డిమారి గుడ్డిసూటిల సీఎం అయిన రేవంత్‌రెడ్డి.. మూడేళ్లు టైమ్‌పాస్ చేసిపోక అవాకులు, చెవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి రైతులకు యూరియా ఇయ్య చేతగాదుగానీ.. అబద్దాలు అనర్గళంగా వస్తయని ఎద్దేవా చేశారు.'కేసీఆర్‌ను మల్ల మొలకెత్తనియ్యను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి శపథం చేయడంపైనా కేటీఆర్ ౄ÷రైయ్యారు. 'నువ్వేంది కేసీఆర్‌ను మొలకెత్తనియ్యకపోయేది' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. మీ కాంగ్రెస్ పార్టీ 60 ఏండ్లు తెలంగాణను తొక్కిపట్టిందని, తెలంగాణను మొలకెత్తనివ్వమని విర్రవీగిందని, అసుంటి కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణను మొలిపించిన మొగోడు, మొనగాడు కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. రైతులకు యూరియా ఇవ్వడంలో రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. సరిపడా యూరియా అందక రైతులు గోస పడుతున్నరని ఆవేదన వెలిబుచ్చారు. 'రేవంత్ పాలనలో యూరియా షాప్‌ల లేదు, యాప్‌ల లేదు' అని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కొత్తగా కార్డు అంటూ కొత్త పాట అందుకున్నరని అన్నారు. 'రైతులకు యూరియా తెలివిలేక నాటకాలాడుతున్న దద్దమ్మలు ఈ కాంగ్రెసోళ్లు' అని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రైతులకు సరిపడా ఎరువులు అందాయని, ఎరువుల దుకాణాల ముందు రైతులు లైన్‌లలో నిలబడాల్సిన అసవరం రాలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టి రైతుల సమస్యలు తెలుసని, ఆయన రేవంత్‌రెడ్డిలా రియల్ ఎస్టేట్ బ్రోకర్ కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# ఎసిబికి చిక్కిన మరో లంచావతారం

## 50 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తాసిల్దార్



**తొలి అక్షరం/ కామారెడ్డి,అక్టోబర్ 6 :** కామారెడ్డి జిల్లాలో తహసీల్దార్ ఏసీబీ వలలో చిక్కాడు. రూ. 50 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నాగిరెడ్డిపేట మండల తహసీల్దార్గా పనిచేస్తున్న యార్లగడ్డ శ్రీనివాస్ రావుతో పాటు లంచం తీసుకోవడంతో మధ్యవర్తిగా వహించిన ప్రైవేట్ వ్యక్తి చినూరు అజయ్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. మండలానికి చెందిన ఓ వ్యక్తి తన తండ్రి పేరుపై ఉన్న వ్యవసాయ భూమిని తన పేరు మీద బదిలీ చేయాలని కోరగా అందుకు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ నేతృత్వంలో సిబ్బంది కార్యాలయంపై మాటు వేసి తహసీల్దార్ లంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిని నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# హైకోర్టును ఆశ్రయించిన రకుల్ సోదరుడు

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 6:** ప్రముఖ నటి సోదరుడు అమన్ ప్రీత్‌సింగ్ హైకోర్టును ఆశ్రయించాడు. మాసబ్ ట్యాంక్ పోలీసు స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని పిటిషన్ వేశాడు. డ్రగ్స్ కేసులో అమన్‌ప్రీత్‌పై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మాదకద్రవ్యాల విక్రేతల నుంచి డ్రగ్స్‌ను కొనుగోలు చేసినట్లు కేసు నమోదైంది. అప్పటి నుంచి అమన్ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశాడు. దీనిపై తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది.



# ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి స్థిరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో నెలకొన్న తీవ్ర వాయు కాలుష్యం కారణంగానే సోనియా గాంధీకి ఈ అనారోగ్యం ఏర్పడినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కాలుష్య స్థాయిలు పెరగడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు సోనియాగాంధీకి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా వైద్యులు గమనిస్తున్నట్లు సమాచారం. కాగా గతంలోనూ సోనియాగాంధీ పలు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే.

# తీవ్రం అవుతున్న పిచ్చికుక్కల బెడద

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించింది. సోమవారం ఒక్కరోజే 50మందిపై దాడిచేసి గాయపరిచింది. ఈ పిచ్చికుక్క దాడిలో నలుగురు చిన్నారులు, 20 మంది మహిళలు, 26 మంది పురుషులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భైంసా ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్క కాటు బాధితులు భారీగా చేరారు. ఆస్పత్రి వైద్యులు తక్షణం మెడికల్ సహాయం అందిస్తున్నారు. పిచ్చి కుక్కలను పట్టుకోవడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి సరైన పరిష్కారం రాలేదని ఆవేదన చెందుతున్నారు. శునకాల దాడులతో తీవ్ర భయాందోళన చెందుతున్నామని వాపోయారు. తమ ప్రాణాలను కాపాడటానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. పిచ్చి కుక్కల దాడులపై ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. శునకాల దాడులు ప్రతిరోజూ పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. అధికారులు సకాలంలో స్పందించకపోతే తీవ్ర ఆందోళనలు చేపడతామని ప్రజలు హెచ్చరించారు. అధికారులు త్వరగా పిచ్చి కుక్కలను పట్టుకోవాలని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# వరంగల్ కోట భూ ఆక్రమణలు తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

నిలయంగా విరాజిల్లుతోందని వ్యాఖ్యానించారు కిషన్‌రెడ్డి. కాకతీయుల కాలంలో ఇతర రాజ్యాల నుంచి ఎదురయ్యే దండయాత్రల నుంచి రాజధానికి రక్షణ కల్పించటం కోసం ఒక ప్రణాళిక ప్రకారం 7 ప్రాకారాలతో వరంగల్ కోటను ఎంతో పకడ్బందీగా నిర్మించారని పేర్కొన్నారు. ఢిల్లీ సుల్తానులు, హైదరాబాద్ నవాబుల దాడులను ఎదుర్కొన్న కోటని అభివర్ణించారు. నేటికీ కాకతీయుల శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రతిరోజూ వేలాదిమంది పర్యాటకులు ఈ కోటను సందర్శించి కోటలో దాగి ఉన్న శిల్ప సంపద, నిర్మాణ నైపుణ్యం, వందలాది ఆలయాలు, వాటి నేపథ్యం, కోట ప్రాధాన్యం గురించి తెలుసుకుంటున్నారని వెల్లడించారు కిషన్‌రెడ్డి. పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవలే సౌండ్, ఇల్యూమినేషన్ లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసిందని వివరించారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో ఉన్న వరంగల్ కోట పరిరక్షణకు, నిర్మాణాల పునరుద్ధరణకు కేంద్రం నిరంతరం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఈ వరంగల్ కోటకు చుట్టూ ఉన్న 7 ప్రాకారాల్లో ప్రస్తుతం 3 ప్రాకారాలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు కిషన్‌రెడ్డి. 3 ప్రాకారాలతో పాటు ఇతర ప్రాకారాలను కొంతమంది స్థానికులు ఆక్రమించి కోట భూముల్లో అనేక అక్రమ కట్టడాలు నిర్మించారని వెల్లడించారు. వరంగల్ కోట అధీనంలో ఉన్న ఒక స్మారక ప్రదేశమని, దీనికి సంబంధించిన భూములను ఆక్రమించడం, అందులో అక్రమంగా నిర్మాణాలను నిర్మించడం చట్టరీత్యానేరమని చెప్పుకొచ్చారు. వెంటనే ఆక్రమించిన భూములను ఖాళీ చేయాలని కోరుతూ అధికారులు ఆక్రమణదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు కిషన్‌రెడ్డి. దే విషయాన్ని తెలియజేస్తూ తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అధికారులు 04.11.2022న అలాగే, ఇటీవల 01.12.2025న వరంగల్ కలెక్టర్‌కి పలుమార్లు లేఖలు రాశానని గుర్తుచేశారు. తాను లేఖ రాసిన కోట భూములను పరిరక్షించటానికి వరంగల్ జిల్లా కలెక్టర్ ఎటువంటి చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# 10 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు

(మొదటి పేజీ తరువాయి)

ఆనవాయితీగా వస్తోంది. జనవరి 17వ తేదీ నుంచి అన్ని పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులను తమ ఇళ్లకు తీసుకురావడానికి తల్లిదండ్రులు ప్లాన్ చేసుకుంటున్నారు.

# అశాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణను సరిచేస్తామని పొంగులేటి పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ తప్పుదాలతో ఒకే నియోజకవర్గంలోని నాలుగు మండలాలు.. నాలుగు జిల్లాల్లో ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించి అందరి ఆమోదంతో పునర్వ్యవస్థీకరణ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

# సింగరేణిలో త్వరలో క్యాథ్ ల్యాబ్: భట్టి

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తాం. విశ్రాంత ఉద్యోగులు అక్కడ మందులు అందించేలా చర్యలు చేపడతాం అని భట్టి విక్రమార్క తెలిపారు.

# 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక అంశం పరిశీలిస్తూన్నామని అన్నారు. ఉబెర్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని.. త్వరలో ఏర్పాటు చేస్తుందని, కాగ్నిజెంట్ సంస్థ ద్వారా 5 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలియజేశారు. పోచారం ఇన్ఫోసిస్ సంస్థ విస్తరణ ద్వారా 17 వేల మంది ఉపాధి, విప్రో సంస్థ విస్తరణ ద్వారా మరో 5 వేల మందికి ఉపాధి ఉంటుందని అన్నారు. 70 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కొనియాడారు. ఇప్పటికే 70 జిసిసిలు రాష్ట్రానికి వచ్చాయని.. సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే జినోమ్ వ్యాలీ నాలుగో దశ కూడా పూర్తయిందని, ఐటీ కంటే ఎక్కువగా ఫార్మా ఎగుమతులు జరుగుతున్నాయని అన్నారు. ఏరోస్పేస్, రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# సర్పంచ్ న్యాయవాదులకు ఘన సన్మానం

● బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముకుందరావు



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 6: మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా న్యాయవాద వృత్తిలో ఉంటూ సర్పంచిగా గెలుపొందిన నాంచారి మడూర్ సర్పంచ్ బంగారు రమేష్ ని మరియు సంతోష్ కుమార్ ను న్యాయవాదులు బార్ అసోసియేషన్ లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముకుంద రావు మాట్లాడుతూ. న్యాయవాద వృత్తి నుండి ప్రత్యక్షంగా ప్రజలకు సేవ చేసే సర్పంచిగా ఎన్నికైనందున న్యాయవాదులుగా మిమ్మును చూసి ఎంతో గర్వపడుతున్నాం అదేవిధంగా నీ మీద నమ్మకంతో మిమ్ములను సర్పంచ్ గా ఎన్నుకున్న ప్రజలకు మంచి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాంచారి మడూర్ సర్పంచ్ బంగారు రమేష్ మాట్లాడుతూ. ఎంతో పవిత్రమైన న్యాయవాదేవృత్తులో ఉంటూ నేను సర్పంచ్గా ఎన్నికైన సందర్భంగా చాలా సంతోషంగా ఉన్నాను అని తెలియపరుస్తూ తప్పకుండా ప్రజలకు న్యాయం చేస్తానని మమ్ములను సన్మానించిన నా కుటుంబ సభ్యులైన తొర్రూర్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కి మరియు సీనియర్ న్యాయవాదులకు నాతోటి న్యాయవాదులకు లేడీ న్యాయవాదులకు ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ ముకుందరావు, ప్రవీణ్ రాజు,వల్లపు మధుసూదన్, రఘురాం రెడ్డి,ఐలోని జల్ల భాస్కర్, నాగరాజు,గౌసు కృపావతి విజయ, యాగేందర్ కుమార్, చంద్రయ్య, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు

# బీజేపీ మండల నాయకుడు తోట రమేష్ జన్మదిన వేడుకలు

**జెండాల మధ్య, నినాదాల హోరులో నిర్వహించిన ఉత్సవ వాతావరణం**

**ముఖ్య అతిథిగా బీజేపీ అధ్యక్షుడు చందు రాజ్ కుమార్.. హాజరైన కీలక నేతలు**




తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 6: నెల్లికుదురు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో భారతీయ జనతా పార్టీ మండల నాయకుడు తోట రమేష్ జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణుల ఉత్సాహం, ఆనందోత్సాహాల మధ్య అత్యంత ఘనంగా నిర్వహించారు. బీజేపీ జెండాలతో అలంకరించిన వేదిక, నినాదాలతో మార్మోగిన ప్రాంగణం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ అధ్యక్షులు చందు రాజ్ కుమార్ హాజరై తోట రమేష్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతంలో ఆయన చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ, రానున్న రోజుల్లో మరింత బాధ్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో నల్లని పాపారావు, జనరల్ సెక్రటరీ యుగేందర్, అలాగే సురేష్, నవీన్, రమేష్, ప్రవీణ్, శివ సాయి, తోట సురేష్, సంపత్, సందీప్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలకు మరింత వైభవాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవే లక్ష్యంగా తోట రమేష్ సాగిస్తున్న ప్రస్థానాన్ని కొనియాడారు.

# మహాజాతరకు.. గవర్నర్,ముఖ్యమంత్రికి ఆహ్వానం





తొలి అక్షరం/హన్మకొండ :మేడారం మహా జాతర కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అధికారిక ఆహ్వానం ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన అతిపెద్ద ఆదివాసీ గిరిజన ఆధ్యాత్మిక వేడుక మేడారం శ్రీసమ్మక్క సారలమ్మ మహా జాతరలో పాల్గొనాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని అధికారికంగా ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రులు కొండా సురేఖ,ధనసరి అనసూయ (సీతక్క), పొంగులేటి శ్రీనివాస రెడ్డి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,సిద్ధబోయిన జగ్గారావు,మేడారం ఆలయ పూజారులతో కలిసి అసెంబ్లీ ఛాంబర్ లో ముఖ్యమంత్రిని కలసి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరకు సంబంధించిన అధికారిక పోస్టర్ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది భక్తులు తరలివచ్చే ఈ మహాజాతరను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం లోక్ భవన్ లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి మేడారం మహాజాతరకు రావాలని ఆహ్వాన పత్రిక ను మంత్రులు సీతక్క,కొండా సురేఖ ఆలయ పూజారులు అందజేశారు.

# కాకతీయ స్కూల్ విద్యార్థి ప్రతిభ

**విద్యార్థి రోహిత్ని ఘనంగా సన్మానించిన స్కూల్ ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి**




తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 06: నాలుగో నేషనల్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్షిప్ 2026 నిర్వహించినారు. లక్ష్యం షూటోకాన్ కరాటే అకాడమీ ఇండియా టోర్నమెంట్ నిర్వహించిన అనిల్ యాదవ్. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పటాన్ చెరువు లో జరిగిన కుంగ్ ఫు ప్రదర్శనలో కాకతీయ స్కూల్ కు చెందిన విద్యార్థి రోహిత్ ప్రథమ స్థానం కైవసం చేసుకొని సత్తా చాటాడు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి, బాలరాజ్ మాస్టర్, మాస్టర్ అహ్మద్ ఖాన్ (బ్రూస్ లీ) శివ కృష్ణ మాస్టర్, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఎన్నికలలో బిఆర్ఎస్ జెండా ఎగరాలి



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 6: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తొర్రూరు మున్సిపాలిటీపై బిఆర్ఎస్ జెండా ఎగరవేయాలని 6వ వార్డు ఇంచార్జ్,బిఆర్ఎస్ పెద్దవంగర మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం 6వ వార్డు బంజారా నగర్( దుబ్బ తండ ) లో భూక్య అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో 6వ వార్డు అధ్యక్షులు రాయిశెట్టి వెంకన్న అధ్యక్షత జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయాలని కోరారు. పట్టణంలో గతంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో చేసిన పనుల తప్ప ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క పని మొదలు పెట్టలేదని, ఇక ముందు కూడా వారు ఎలాంటి పనులు చేపట్టలేరని ఎద్దేవా చేశారు. రానున్న కాలంలో బిఆర్ఎస్ పార్టీ మాత్రమే అధికారంలోకి వస్తుందని, కావున కార్యకర్తలు అందరూ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అరిపిరాల మాజీ సర్పంచ్ గద్దల బిక్షపతి,మాజీ ఎంపీటీసీ మంగళపల్లి ఆశయ, ధరావత్ అరుణ బాలు, బిఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి రాయి శెట్టి ఉపేందర్, మంగళ పెల్లి నాగరాజు, ధరావత్ గణేష్, భూక్య శ్రీకాంత్,మంగళపల్లి సుధాకర్, మంగ్య, భూక్య ప్రియాంక, భూక్య సరోజ భూక్య సావిత్రి, భూక్య విజయ, భూక్య సుజాత, బుక్య పద్మ, భూక్య శ్రీలత, గిరిజన నాయకులు, మహిళలు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మెగా క్రీడోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తొలి అక్షరం/రామన్నపేట జనవరి 6: రామన్నపేట బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంట్ మెగా క్రీడోత్సవం ( ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం ) సన్నాహక మీటింగ్ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి నకిరేకల్ ఇంచార్జ్ నకిరేకంటి మొగులయ్య హాజరై వారు మాట్లాడుతూ మెగా క్రీడోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామన్నపేటలో వివిధ గ్రామాల యువతని కోరడం జరిగింది ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గ్రామీణ క్రీడాకారులని ప్రోత్సహిస్తూ మండల స్థాయి నియోజకవర్గస్థాయి పార్లమెంట్ స్థాయిలో కబడ్డీ క్రికెట్ వాలీబాల్ కోకో లాంటి ఆటలు పార్లమెంటు పరిధిలో నిర్వహిస్తున్నారు ఈ అవకాశాన్ని మండలంలో ఉన్న అన్ని గ్రామాల యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య బిజెపి సీనియర్ నాయకులు డోగుపర్తి సుభాష్ యువ మోర్చా జిల్లా కార్యదర్శి అక్కినపల్లి సైదులు మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ బెజ్జంకి శివకుమార్ మండల ఉపాధ్యక్షులు కంభంపాటి శివరంజన్ కార్యదర్శులు బందెల సంజీవ రేపాక లింగస్వామి బిజెపి నాయకులు రాపోలు రమేష్ సింగు శంకర్ రెడ్డి బొడ్డు పెల్లి సైదులు మేడి పరశురాం ఐలాపురం అశోక్ గురజాల నవీన్ రెడ్డి గురజాల నిరంజన్ రెడ్డి దాకోజీ నాగరాజు కంచి రమేష్ ఎర్రబోయిన వెంకన్న సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజారోగ్య సంక్షేమంలో ఫార్మసీ అధికారుల పాత్ర అత్యంత కీలకం

● హన్మకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య



తొలి అక్షరం/హన్మకొండ : ప్రజల ఆరోగ్య సంక్షేమంలో ఫార్మసీ అధికారుల పాత్ర అత్యంత కీలకమని హన్మకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య అన్నారు. హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ ప్రాంగణంలో హన్మకొండ,వరంగల్ జిల్లాల ఫార్మసీ అధికారుల అసోసియేషన్ ల క్యాలెండర్ను ఆయన ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఫార్మసిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రోగికి వైద్యుడికి మధ్యన వారధిగా ఫార్మసిస్టుల సేవలు అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక ఫార్మసీ డైరెక్టరేట్ ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి కి వివరించినట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ అన్నారు ఫార్మసిస్టులకు రాబోయే పిఆర్సి లో అర్హతలకు,పనికి,తగిన మెరుగైన వేతనాలను ఇప్పించేందుకు నూతన పెరివిజన్ కమిషన్ అధికారులను కలిసి ప్రయత్నించనున్నట్టు సుదర్శన్ గౌడ్ తెలిపారు. కొత్త మెడికల్ కళాశాలలో వాటి అనుబంధ ఆస్పత్రుల్లో అవసరమైన ఫార్మసీ ఆఫీసర్స్ సీనియర్ ఫార్మసీ ఆఫీసర్స్ లతోపాటు చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పోస్టుల మంజూరికి మంత్రిని కలిసి వివరించినట్టు అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్టు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు అన్నారు రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షులు ఉప్పు భాస్కరరావు మాట్లాడుతూ మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 పోస్టుల భర్తీ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని చేరుకుందని త్వరలోనే ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టుల నియామక ప్రక్రియ పూర్తికానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నార్ల వేణు,కార్యదర్శులు సతీష్,రాజేందర్ లు వరంగల్ సి ఎం ఎస్ ఇన్చార్జ్ ఫార్మసీ ఆఫీసర్ నాగమణి హన్మకొండ సి ఎం ఎస్ సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ వి నళిని ఎంజిఎం సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ మరియమ్మ,అసోసియేషన్ నాయకులు సంతోష్,బిక్షపతి,సత్యం,నాగేందర్,రమేష్,విజయ,సునీత,విజయలక్ష్మి,శ్రీదేవి,సృజన,సరళ లతోపాటు సుమారు వందమంది హన్మకొండ వరంగల్ జిల్లాల ఫార్మసీ అధికారులు పాల్గొన్నారు

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వస్తువుల పంపిణీ




తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 6: లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సూర్నం రామ నరసయ్య అధ్యక్షతన ప్రతివారం లైన్స్ క్లబ్ సేవల సందర్భంగా తొర్రూరులో రిక్ష కార్మికులకు నిత్యవసర సరుకులు, ఖానాపురంలో పేదలకు పండ్లు, చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ నర్సయ్య మాట్లాడుతూ లయన్స్ క్లబ్ పేదలకు అండగా ఉంటుందన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సైక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సన్మాన కార్యక్రమం



తొలి అక్షరం/రామన్నపేట జనవరి 6:రామన్నపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు నూతన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు సుక్కాశ్రవణ్ కుమార్ అడ్వకేట్ నియామకం సందర్భంగా రామన్నపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది .ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సబితా జూనియర్ సివిల్ జడ్జి శిరీష బార్అసోసియేషన్ ప్రెసిడెంట్ మజీద్ వైస్ ప్రెసిడెంట్ యాదాసు యాదయ్య , జనరల్ సెక్రెటరీ మొగులయ్య సీనియర్ న్యాయవాదులు కాంపాటి యాదగిరి యాపాలా కృష్ణారెడ్డి ఉయ్యాల హనుమంతు గౌడ్ కేమ రామదాసు జినుకల ప్రభాకర్ అశోక్ కుమార్ , బర్ల డేవిడ్ , గాలి లింగయ్య , జగతయ్య , నోముల స్వామి మామిడి వెంకట్ రెడ్డి కునూరు శ్రీనివాస్ గౌడ్ రోసితామస్ గడ్డం నరసింహా నూతి రమేష్ సతీష్ రెడ్డి మణికంఠ అజీజ్ గాలి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

# సమాజ సేవే లక్ష్యంగా రామన్నపేట లయన్స్ క్లబ్






తొలి అక్షరం/రామన్నపేట జనవరి 6:రామన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి నందు సుమారు 200 మంది పేషెంట్స్ కి మంచి భోజన సౌకర్యం కల్పించడం జరిగినది వారికి అరటి పండ్లు ఇవ్వడం జరిగినది అనంతరం రామన్నపేట హరిజనవాడ పాఠశాల నందు జనంపల్లి ప్రైమరీ పాఠశాల నందు నిజాంపల్లి ప్రైమరీ పాఠశాల నందు విద్యార్థులకు న్యూట్రిషన్ కిట్స్ అందజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ గాలయ్య క్లబ్లయన్స్ క్లబ్ సెక్రెటరీ లయన్ భాస్కరరావు లయన్ కృష్ణా రెడ్డి లయన్ సిద్ధప్ప లయన్ వెంకటేశం లయన్ సత్యనారాయణలయన్ నర్సిరెడ్డి లయన్ బిక్షం రెడ్డి లయన్ సురేందర్ రావు లయన్ ప్రభాకర్ జింకల లయన్ బాబురావు తదితరులు పాల్గొన్నారు అనంతరం లయన్ గాలయ్య అధ్యక్షులు వారిని క్లబ్ నుండి సన్మానించడం అయినది



## ఏపీపీగా డివిఎస్ మూర్తి నియామకం



తొలి అక్షరం/పెద్దపల్లి,జనవరి 06: పెద్దపల్లి జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది దూడం వెంకట సాంబ మూర్తిని పెద్దపల్లి సీనియర్ సివిల్ మరియు అసిస్టెంట్ సెషన్స్ కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.నియామక ప్రక్రియ పూర్తయిన అనంతరం,మంగళవారం ఆయన తన నూతన బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు.ఇకపై ఆయన కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదిస్తూ,ముఖ్యంగా పోలీసులకు సంబంధించిన క్రిమినల్ కేసులను పర్యవేక్షించి, వాదించనున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావులకు డి.వి.ఎస్. మూర్తి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు గోపగాని సారయ్య గౌడ్,నూగిళ్ల మల్లయ్యలకు,పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్ మరియు ఇతర బార్ సభ్యులకు,తోటి న్యాయవాదులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.సుదీర్ఘ అనుభవం కలిగిన డి.వి.ఎస్.మూర్తి నియామకంపై న్యాయవాద వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

## బోర్ ప్రారంభించిన బీజేపీ నాయకులు...





తొలి అక్షరం/కరీంనగర్ రూరల్,జనవరి06:కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ గ్రామంలోనీ బస్టాండ్ కమాన్ యాదవ వాడ లో మంచినీటి కి ఇబ్బంది పడుతున్న సమస్యను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కి తెలుపగానే వెంటనే స్పందించి బోర్ మంజూరు చేయడం జరిగింది. బోర్ కి మంగళ వారం మోటార్ బిగించి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి మాజీ మండల అధ్యక్షులు కడార్ల రతన్ కుమార్, ఎలగందుల మాజీ ఉపసర్పంచ్ బోనాల నరేష్, బోనాల అంజయ్య, జంగిలి రాజు, గడ్డి శేఖర్, జంగిలి రవి, గుండా సిద్దు, మిట్ట వంశి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కృషితో పనులు ప్రారంభం: మాజీ ఎంపిటిసి కట్కూరి పద్మ నరేందర్ ..



తొలి అక్షరం/చిట్యాల జనవరి 6: చిట్యాల మండల కేంద్రంలోచిట్యాల (చలివాగు) వెళ్లే R,B రోడ్డు నుండి శ్మశానవాటిక కు వెళ్ళే రహదారి సీసీ రోడ్డు అంచనా విలువ 70. లక్షల తో నిర్మాణ పనులకు గత కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు. గారు శంకుస్థాపన చేసిన సందర్భంగా. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కృషితో మాజీ ఎంపిటిసి కట్కూరి పద్మా నరేందర్. ఆధ్వర్యంలో సోమవారం రోజున పనులు ప్రారంభించారు కార్యక్రమంలో. కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ గంగాధర్ రవీందర్. యూత్ ప్రెసిడెంట్ అల్లం రాజు. బుర్ర రాజ్ కుమార్. బుర్ర మొగిలి గోల్కొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అరుంధతి పద్మారెడ్డి గార మనవడు కార్తికేయ రెడ్డి జన్మదినం సందర్భంగా దుప్పట్ల పంపిణీ

● ప్రాథమిక విద్యతోనే ఉన్నత విద్యాకు తొలి అడుగు





తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 06: తుప్పగూడెం పద్మారెడ్డి అరుంధతి మనవడు కార్తికేయ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని గంగన్నగూడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు, సాక్సులు, తల టోపీలను PACS చైర్మన్ చిట్టెం దామోదర్ రెడ్డి, సర్పంచ్ విక్రమ్ రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులతో కలిసి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులు భావి భవిషత్ పౌరులు నేటి విద్యార్థులు భవిషత్ తరాలకు వారసులని విద్యార్థి దశలో ఉన్నత మార్గంలో చక్కటి విద్య బుద్దులు అలవర్చుకోవాలని అన్నారు. నేటి పిల్లలు భవిషత్ యువకులు ఈ దేశానికి సమాజానికి తమవంతు కృషిని అందించాల్సిన బాధ్యత ఉన్న వారని అన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ విక్రమ్ రెడ్డి మాట్లాడుతూఈరోజు గంగన్నగూడ గ్రామ పెద్దలు తుప్పగూడెం పద్మారెడ్డి అరుంధతి మనవడు కార్తికేయ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని ఈరోజు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు, సాక్సులు, తల టోపీలను అందజేయడం గ్రామం పట్ల , విద్యార్థుల పట్ల వారికి ఉన్న ఆదరాభిమానాలకు హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. విద్యార్థులు మంచి నడవడిక తోటి ఉపాధ్యాయులు చెప్తున్న పాఠాలు నేర్చుకోవడం మంచి నడవడి విద్య బుద్దులు అలవర్చుకోవాలని పై చదువులకు ప్రాథమిక విద్యనే మూలమని ఆ దిశగా ముందుకు వెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నేటి దాతలు తుప్పగూడెం పద్మారెడ్డి అరుంధతి,ౠజూ చైర్మన్ చిట్టెం దామోదర్ రెడ్డి , టి. గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ పల్లె హనుమంత్ , విలేజ్ సెక్రటరీ సుమలత,ఉపాధ్యాయురాలు మానస, తదితరులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తిలో కోతుల బెడదపై గ్రామపంచాయతీకి వినతి

తక్షణ చర్యలు తీసుకోవాలంటూ గ్రామ ప్రజల డిమాండ్





తొలి అక్షరం/ఇనుగుర్తి జనవరి 6: ఇనుగుర్తి గ్రామంలో కోతుల సమస్య తీవ్రరూపం దాల్చడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతులు ఇళ్లలోకి చొరబడి వస్తువులను ధ్వంసం చేయడం, రైతుల పంటపొలాలను నాశనం చేయడం వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు భయంతో బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొన్నదని గ్రామస్తులు పేర్కొన్నారు.గ్రామంలోని దేవాలయాలకు వెళ్లే మార్గాల్లో, అలాగే గుంటిచెరువు, బేటి చెరువు, కత్వ చెరువు వైపు వెళ్లే ప్రధాన దారుల్లో కోతుల సంచారం అధికంగా ఉండటంతో వాహనదారులు, రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతి పత్రంలో వివరించారు. ఈ సమస్య వల్ల గ్రామంలో భద్రతా సమస్య కూడా ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తమైంది.ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శికి గ్రామ ప్రజల తరఫున ఈరోజు గ్రామపంచాయతీ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కోతుల సమస్యపై తక్షణ చర్యలు తీసుకొని గ్రామ ప్రజలకు, రైతులకు, రైతు కూలీలకు ఉపశమనం కలిగించాలని వారు కోరారు. గ్రామ హితం దృష్టిలో ఉంచుకొని అధికారులు త్వరితగతిన స్పందించాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి: జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 6: పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా విద్యా శాఖ అధికారి రాజేశ్వర్, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్ఎంలతో కలిసి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ విద్యా శాఖకు సంబంధించి పలు అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కాంప్లెక్స్ హెచ్ఎంల పరిధిలో ఉన్న పాఠశాలల హెచ్ఎంలతో సమీక్షలు నిర్వహించాలని, పదిలో నిదానంగా ఉన్న విద్యార్థులను గుర్తించి, వారి వృద్ధి కొరకు తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి రోజు విద్యార్థులచే అన్ని సబ్జెక్టులను చదివించి, సాధన చేయించాలని, అలాగే విద్యార్థుల చేతి రాతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తద్వారా మెరుగైన ఫలితాలను రాబట్టవచ్చని వివరించారు. ప్రతి రోజు విద్యార్థుల ప్రగతిని పరిశీలించాలని, ఫిబ్రవరిలో జరగబోయే ఎఫ్ఎల్ఎస్ పరీక్షలో మూడవ తరగతి విద్యార్థులు మంచి సామర్థ్యాలను చూపాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు, విద్యార్థులను సన్నద్ధం చేయాలని, జిల్లాను ముందంజలో ఉంచేందుకు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అదే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులతో వారి పురోగతి గురించి చర్చించాలని తెలిపారు.విద్యార్థుల వ్యక్తిగత, మానసిక స్థితిగతులను నిత్యం పరిశీలిస్తూ, వారి తల్లిదండ్రులతో తెలుసుకోవాలని, వారికి వేకప్ ఫోన్ కాల్స్ చేయాలని, ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఇంగ్లీషు సబ్జెక్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు ఇంగ్లీషు భాష నైపుణ్యతపై మెలకువలు నేర్పాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏసీజీ మందుల శ్రీరాములు, సైన్స్ అధికారి అప్పారావు, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ పూర్ణచందర్, ఏఎస్పీ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు: పట్టణ ఎస్హెచ్ఓ గట్ల మహేందర్ రెడ్డి



తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 6: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వ్యతిరేకంగా పాల్పడితే ఉపేక్షించేది లేదని పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గట్ల మహేందర్ రెడ్డి హెచ్చరించారు.గత సంవత్సరం డిసెంబర్ 14వ తేదీన భూక్య సుధాకర్ అనే ఆర్టీసీ డ్రైవర్ విధుల్లో ఉండగా గూడూరు మండలం రాములు తండాకు చెందిన ఆటో డ్రైవర్ ఎండి షారుక్ (గ్రా/శీ ఖాసీం) తన ఆటోను అజాగ్రత్తగా నడిపి ఆర్టీసీ డ్రైవర్ సుధాకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ విషయమై ప్రశ్నించగా, నిందితుడు ఇష్టానుసారంగా బూతులు తిడుతూ చేతులతో కొట్టి గాయపరిచినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆదేశాలతో ఎస్సై ఎండీ. అలీం హుస్సేన్ విచారణ చేపట్టారు. విచారణ అనంతరం మంగళవారం నిందితుడు ఎండి షారుక్‌ను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరచి జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్లు పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు.

## ఎలికట్ట గ్రామ విద్యుత్ సమస్యల పరిష్కారానికి డీఈ శ్యాంసుందర్ రెడ్డిని కలిసిన సర్పంచ్

● మీ సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తా...: డి ఈ హామీ

● కృతజ్ఞతలు తెలిపిన ఎలికట్ట గ్రామ సర్పంచ్ బుడ్డ నవకిరని నరసింహ



తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 06: ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో నెలకొన్న విద్యుత్ సరఫరా సమస్యలపై గ్రామ సర్పంచ్ వాకిటి నవకిరని, బుడ్డ నర్సింలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా.... సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. వెంటనే గ్రామ సర్పంచ్ విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ (డీఈ) శ్యాంసుందర్ రెడ్డిని కలిసి గ్రామంలో ఎదురవుతున్న తరచూ విద్యుత్ అంతరాయాలు, వోల్టేజ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన ఇబ్బందులపై వివరించారు.ఈ సందర్భంగా డీఈ శ్యాంసుందర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ...గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన సాంకేతిక పరిశీలన చేపట్టి, విద్యుత్ సరఫరా మెరుగుపడేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.గ్రామాభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల మెరుగుదల అత్యంత కీలకమని సర్పంచ్ వాకిటి నవకిరని పేర్కొన్నారు.విద్యుత్ సమస్యలు పరిష్కారమైతే రైతులు, వ్యాపారులు, గృహ వినియోగదారులకు ఊరట కలుగుతుందని అన్నారు.సానుకూలంగా స్పందించిన డిఇ శ్యాంసుందర్ కు గ్రామ పాలక వర్గాలు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు గడ్డమీది శ్రీను, గోనెలా రాము,మరియు యాంకనోల యాదగిరి,తదితరులు పాల్గొని గ్రామ ప్రజల తరఫున తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## ప్రజాస్వామ్యానికి ప్రత్యక్ష అద్దం: 'తెలుగు వార్త హెచ్‌డి'లో అసెంబ్లీ లైవ్

● ప్రజల వద్దకే శాసనసభ చర్చలు: సీఈవో తాడూరి సంపత్

● నిష్పక్షపాత జర్నలిజమే మా ధ్యేయం



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 6: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే ప్రాణమని, వారికి శాసనసభలో జరుగుతున్న ప్రతి అంశం స్పష్టంగా తెలియాలనే ఉద్దేశంతో 'తెలుగు వార్త హెచ్‌డి' ఛానల్ అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ఈ మేరకు ఛానల్ సీఈవో తాడూరి సంపత్ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు.ప్రజల గొంతుక - బాధ్యతాయుత ప్రసారాలుప్రజల హక్కులు, వారి గొంతు, మరియు భవిష్యత్తు రూపుదిద్దుకునే వేదిక అసెంబ్లీ అని, అటువంటి కీలక సమావేశాలను నేరుగా ప్రజల ముందుకు తీసుకురావడం ఒక బాధ్యతగా చేపట్టామని సంపత్ తెలిపారు. సభలో జరిగే ప్రతి చర్చ, ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం సామాన్య ప్రజలకు చేరవేయడమే ఈ లైవ్ ప్రసారాల ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.వక్రీకరణ లేని సమాచారం.. ప్రజా చైతన్యమే లక్ష్యంనిష్పక్షపాత జర్నలిజం, విశ్వసనీయ వార్తలు, మరియు వక్రీకరణ లేని సమాచారాన్ని అందించడమే తమ సంస్థ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. కేవలం వార్తలు అందించడమే కాకుండా, ప్రజల్లో రాజకీయ అవగాహనను, ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించడానికి తెలుగు వార్త హెచ్‌డి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## పేద విద్యార్థినికి విద్యా భరోసా శ్రీ రుద్ర ఆర్యనాథన్ గోసేవ ట్రస్ట్ చేయూత



తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 06: చదువుకోవాలనే తపన ఉన్నా ఆర్థిక స్థోమతల లేమితో వెనుకబడిన కుటుంబాలకు శ్రీ రుద్ర ఆర్యనాథన్ గోసేవ ట్రస్ట్ అండగా నిలుస్తోంది. షాద్‌నగర్‌కు చెందిన పేదింటి అమ్మాయి జశ్విత చదువు కొనసాగేందుకు ట్రస్ట్ తరఫున రూ.12,000 ఆర్థిక సహాయం అందించారు.జశ్విత తల్లి విజయ ఆశ వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. భర్త గతంలో మృతి చెందడంతో ఒక్కరే బాధ్యతలు మోస్తూ, కూతురు చదువు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ట్రస్ట్ సభ్యులు స్పందించి, జియాన్ హై స్కూల్ షాద్‌నగర్ ప్రిన్సిపల్ కల్పన మేడంకు శ్రీశ్రీశ్రీ సత్యనారాయణ రెడ్డి గురుస్వామి గారి కరములచేత స్కూల్ ఫీజు రూ.12,000 చెల్లించారు. అదనంగా కుటుంబ ఆకలి తీర్చేందుకు 25 కేజీల బియ్యం బస్తాను కూడా అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ...ఇలాంటి సేవా కార్యక్రమాలతో పాటు గో సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మిక సేవలు, సనాతన ధర్మ పరిరక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని తెలిపారు

# తొర్రూరు గోపా సేవలు అభినందనీయం

**- గోపా రాష్ట్ర ఉపాధ్యక్షులు, రామ్మోహన్ గౌడ్, మహబూబాద్ జిల్లా అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 6:** తొర్రూరు గోపా ఆధ్వర్యంలో నిర్వహించే సేవలు అభినందనీయమని, అలాంటి సేవలను విస్తృత పరిచి మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర గోపా ఉపాధ్యక్షులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్,మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు.గోపా మండల శాఖ ఆధ్వర్యంలో గోపా డివిజన్ అధ్యక్షులు,వికాస్ స్కూల్ కరస్పాండెంట్ తాళ్లపెల్లి రమేష్ గౌడ్ మరియు భాగ్యశ్రీ బోర్ వెల్స్ ప్రొప్రేటర్ దేశగాని కుమార్ గౌడ్ ల ఆర్థిక సహకారంతో రూపొందించబడిన నూతన సంవత్సర క్యాలెండర్ లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గోపా మండల అధ్యక్షులు రాయి పెల్లి యాకయ్య గౌడ్ అధ్యక్షతన స్థానిక వికాస్ హైస్కూల్ వెలికట్టే లో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి సమావేశాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా తొరూరు మండల గోపా అధ్యక్షులు రాయిపెల్లి యాకయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామ్మోహన్ గౌడ్,కుర్ర శ్రీనివాస్ గౌడ్ సంయుక్తంగా మాట్లాడుతూ అణగారిన వెనుకబడిన ప్రజల ఐక్యతకు కృషి చేయాలని,సామాజికంగా అభివృద్ధి దిశలో పయనించే విధంగా ప్రయత్నం చేయాలని,ఈ నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.క్యాలెండర్ రూపకల్పనకు సహకరించిన రమేష్ గౌడ్,కుమార్ గౌడ్, అతిథులు రామ్మోహన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ లను గోపా ప్రతినిధులు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, నర్సింగం గౌడ్, జనగాం జిల్లా అధ్యక్షుడు మేకపోతుల ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి కంకటి ముక్తేశ్వర్ గౌడ్,బిక్కి వెంకటేశ్వర్లు గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గందసిరి కృష్ణ గౌడ్, కోశాధికారి చిరగాని రమేష్ గౌడ్, గౌడ సహకార పరపర సంఘం అధ్యక్షులు దీకొండ శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి జలగం శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి బాలగాని నర్సయ్య గౌడ్, గోపా ప్రధాన కార్యదర్శి పంజాల వెంకట్రామ్ నర్సయ్య గౌడ్ కోశాధికారి పనస ప్రవీణ్ గౌడ్, గౌడ ప్రతినిధులు చీకటి అశోక్ గౌడ్,ఓం ప్రకాష్ గౌడ్, రావుల యాదగిరి గౌడ్, అనేపురం వెంకన్న గౌడ్, పెరుమాళ్ళ రమేష్ గౌడ్, పెరుమళ్ళ యాదగిరి గౌడ్,పులి ముత్తిలింగం ,మోడెం సోమ నర్సయ్య గౌడ్, గట్టు కమలాకర్ గౌడ్, తాళ్ల పెల్లి బిక్షం గౌడ్ కొండం జనార్దన్ గౌడ్, కుంభం జగన్నాథం గౌడ్, తాళ్లపల్లి నాగయ్య గౌడ్, కుంభం మహేష్ గౌడ్, నగేష్ గౌడ్ రావుల సదానందం గౌడ్, గునిగంటి శ్రీనివాస్ గౌడ్, రావుల శోభన్ బాబు గౌడ్, కోటగిరి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ జనసేన షాద్ నగర్ టౌన్ ప్రధాన కార్యదర్శిగా వడ్ల సుకన్య చారి



**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 06:** బీసీ జనసేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కాటన్ భాగ్యలక్ష్మి గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షులు కత్తి శేకరప్ప ఆదేశాల మేరకు 26 వ వార్డు అధ్యక్షురాలు వడ్ల సుకన్య చారి షాద్ నగర్ టౌన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది.సమావేశానికి గౌరవ అధ్యక్షులు మేకల వెంకటేష్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు అరుణ గౌడ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి స్రవంతి రాజ్ షాద్ నగర్ టౌన్ ఉపాధ్యక్షులు రాములు గౌడ్, అలివేలు , శ్వేత, మంజునాథ్ హాజరైనారు.

# ఘనంగా ట్రెసా డైరీ ఆవిష్కరణ రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

**• మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 6:** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ట్రెసా డైరీ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగింది. ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై,2026వ సంవత్సర డైరీని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో 'ప్రజా ప్రభుత్వం' కొలువుదీరిందని, పక్క రాష్ట్రాల ప్రజలు సైతం అసూయ పడేలా పాలన సాగిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రెవెన్యూ శాఖలో పారదర్శకత పెంచేందుకు త్వరలోనే కీలక సంస్కరణలు ప్రవేశపెడతామని స్పష్టం చేశారు.రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి ట్రెసా నాయకత్వం తీసుకెళ్లింది. దీనిపై మంత్రి స్పందిస్తూ.రెవెన్యూ ఉద్యోగుల సమస్యలన్నీ మా ప్రభుత్వానికి తెలుసు.త్వరలోనే ట్రెసా సంఘం నాయకులతో ప్రత్యేకంగా భేటీ అవుతాము.తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించడం, వీఆర్ఏ లు మరియు జిపిఓల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తాం" అని హామీ ఇచ్చారు.అంతకుముందు ట్రెసా అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ల ఫైళ్లను క్లియర్ చేయాలని మంత్రి ని కోరారు. ప్రభుత్వం తీసుకునే సంస్కరణలకు రెవెన్యూ ఉద్యోగులందరూ సహకరిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మహబూబాద్ జిల్లా కార్యాలయ సిబ్బంది తొర్రూర్ డివిజన్ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రెవెన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే బిక్షపతి యాదవ్ పుట్టినరోజు వేడుకలు



**తొలి అక్షరం/శేరిలింగంపల్లి జనవరి 06:-** మాజీ శాసనసభ్యులు బిక్షపతి యాదవ్ జన్మదిన వేడుకలు మసీద్ బండ, కొండాపూర్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.నియోజకవర్గ పలు డివిజన్ల నుండి అభిమానులు, పార్టీ నేతలు పెద్ద ఎత్తున వచ్చి శాలువాతో సత్కరించారు .ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ పారిశుద్ధ్య కార్మికులకు, పేదవారికి చీరల పంపిణీ చేస్తూ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.జన్మదిన వేడుకలలో నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావ, రవీందర్ రావు, బుచ్చిరెడ్డి, వసంత్ యాదవ్, నరసింహ యాదవ్, అనంతరెడ్డి, సోందాస్, రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, నర్సింగ్ యాదవ్ ,నరసింహ చారి, వెంకటస్వామి రెడ్డి, ఆంజనేయులు సాగర్, దేశాల్, సీతారామరాజు, ఓబుల్ రెడ్డి, మహిళా నాయకులు పద్మ ,కవిత, విజయలక్ష్మ ,స్రవంతి సరితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారత గడ్డపై సిపిఐకి వందేళ్లు: సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి



**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 6:** మంగళవారం రోజున రామన్నపేట మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ మండల కమిటీ సమావేశం రచ్చ యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ,1925 డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని, భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్రం కావాలని తొలుత కోరిన పార్టీ సిపిఐ అని, 2025 డిసెంబర్ 26 తో సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని, బ్రిటిష్ వారిపై మన దేశానికి స్వాతంత్రం కావాలని రాజీలేని పోరాటాలు చేస్తున్నందునే ఆనాడు పార్టీపై నిషేధం విధించారని కాన్పూరు ,పెషావర్ లలో కుట్ర కేసులు పెట్టి నాయకులను జైలులో నిర్బంధించారని, అయినప్పటికీ విద్యార్థి యువజన కార్మిక రైతు మహిళ తదితర ప్రజా సంఘాలు నిర్మించి వెట్టిచాకిరి విముక్తి కొరకు కార్మికులు కర్షకులకు జరుగుతున్నటువంటి దోపిడీని విముక్తి చేయడానికి అనేకమైన పోరాటాలు సిపిఐ నిర్వహించిందని, ఈ శతాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు ఎన్నో త్యాగాలు ఎంతోమంది అమరవీరుల రక్త తర్పణంతో,ఎన్నో విజయాలు సాధించిన సిపిఐ పార్టీ భారత దేశ రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నదని, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తికై తెలంగాణలో హైదరాబాద్ సంస్థానాన్ని పారలిస్తున్నటువంటి నిరంకుశ నిజామును గద్దె దించడానికి తెలంగాణ సాయుధ పోరాటం చేసి నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలను, 3000 గ్రామాల విముక్తిని, పది లక్షల ఎకరాలను భూమిని పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని, ఆనాటి సాయుధ పోరాటమే అనేక ఉద్యమాలకు స్ఫూర్తి అయిందని, అస్ఫూర్తితోనే తెలంగాణను సాధించడం జరిగిందని, సిపిఐ పోరాటాల ఫలితమే భూ సంస్కరణలు, గరీబీ హటావో,బ్యాంకుల జాతీయకరణ వంటి అనేక సంస్కరణలు చేయాల్సి వచ్చిందని, తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థను పర్యవేక్షించేందుకు సింగరేణి కార్మికుల సమస్యలపై అనేక పోరాట నిర్వహించిందని, సహజ వనరులను కాపాడేందుకు బయ్యారంలోని లక్షలకోట్ల విలువైన ఖనిజ సంపదను కాపాడిందని, యూపీ ఏ వన్ ప్రభుత్వంలో చారిత్రాత్మకమైనటువంటి సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ పథకం పై చట్టం, అటవీ హక్కుల చట్టం తీసుకురావడానికి సిపిఐ పార్టీ కృషి చేసిందని వారు అన్నారు.. 2014లో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బిజెపి ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ధరలు తగ్గిస్తామని, కోట్ల ఉద్యోగాలు 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజాకర్షణ పథకాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి ఏమీ అమలు చేయకుండా దేశ ప్రజల మధ్య కులాల మధ్య, మతాల మధ్య చిచ్చులు పెడుతూ, భావోద్వేగాలు రెచ్చగొడుతూ అధికారం పొందుతుంది తప్ప ప్రజలకు సంబంధించిన అవసరం వచ్చే ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని , ఆరు దశాబ్దాలుగా ప్రజల కార్మికుల త్యాగాలతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, బ్యాంకులు , టెలికాం గనులు, రక్షణ రంగాలలో సైతం ప్రైవేట్ పరం చేస్తున్నారని అంబానీ, ఆదాని వంటి కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని సంపన్నులు మరింత సంపన్ను అవుతుంటే పేదలు మరింత పేదలుగా అవుతున్నారని రైతులను కార్మికులను పెట్టుబడుదారీ కట్టు బానిసలుగా మార్చే చట్టాలు తెచ్చారని, వీటిని నివారించడానికి సిపిఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత గురించి , వామపక్ష ప్రజాతంత్ర ఐక్యత కోరుకుంటున్నారని సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఖమ్మం నగరంలో జరిగే భారీ బహిరంగ సభ ఒక మార్పుకు సూచనగా మారబోతుందని తెలియజేశారు.... ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరు నరసింహ, సిపిఐ జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామచంద్రం,సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య , ఊట్కూరి భగవంత, వార్డు సభ్యురాలు భారతమ్మ , గంగాపురం వెంకటయ్య, గంగాపురం యాదయ్య, వీరమల్ల ముత్తయ్య, సంగిశెట్టి పాండు, ఊట్కూరు కృష్ణ, ఏనూతుల రమేష్, మీసం గాలయ్య, సిహెచ్ మల్లయ్య, రచ్చ దయాకర్ తదితరులు పాల్గొన్నారు...

## శ్రేష్ట పరీక్షలో అల్ ఇండియా 324 ర్యాంకు సాధించిన సీఎం హర్షిని

**తొలి అక్షరం/ఉరవకొండ జనవరి 06:-** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన శ్రేష్ట పరీక్షలో సీఎం హర్షిని 324 ఆల్ ఇండియా ర్యాంకు సాధించి సత్తా చాటింది. ఉరవకొండలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సీఎం గోవిందు,ఎం ధనలక్ష్మి దంపతుల కుమార్తె సీఎం.హర్షిని పదవ తరగతి చదువుతున్నది.కేంద్ర ప్రభుత్వం శ్రేష్ట పథకం కింద 8,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్కీం ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హై స్కూల్స్ ఇన్ టార్గెటెడ్ ఏరియాస్(శ్రేష్ట)పథకం కింద ఉచిత విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 21 - 2025 సంవత్సరమున ప్రవేశ పరీక్ష నిర్వహించింది.శ్రేష్ట పరీక్షలలో సీఎం హర్షినితోపాటు అదే పాఠశాలలో చదువుతున్న ఎ.వర్షిత్ - 871,ఎ.అక్షర -1074 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించినందుకు ముగ్గురు విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ పి.నాగరత్నం,హెడ్మాస్టర్ రవీంద్రారెడ్డి విద్యార్థినిలకు అభినందనలు తెలిపి భవిష్యత్తులో బాగా చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు.ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు:ూా ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్ఐ సత్యానందం హెచ్చరిక

**• బాచుపల్లినిజాంపేట్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన సదస్సు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 6:** "ప్రజల ప్రాణాలే మా బాధ్యత.. ట్రాఫిక్ క్రమశిక్షణే మా లక్ష్యం" అని బాచుపల్లినిజాంపేట్ ట్రాఫిక్ ఎస్ఐ సత్యానందం స్పష్టం చేశారు. బాచుపల్లినిజాంపేట్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు, ప్రయాణికులకు భద్రతను చేకూర్చేందుకు ఆయన ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై ఉక్కుపాదం మోపుతామని కఠిన హెచ్చరికలు జారీ చేశారు.ఆటో నడిపే ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, ఇది వృత్తిపై గౌరవంతో పాటు బాధ్యతను గుర్తు చేస్తుందని ఎస్ఐ పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం ప్రాణాంతకమని, దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని చెప్పారు. అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాలతో పాటు వాహనాల సీజ్ కూడా ఉంటుందని హెచ్చరించారు.మద్యం తాగి నడిపితే లైసెన్స్ రద్దు:మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల కనికరం చూపే ప్రసక్తే లేదని సత్యానందం స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేయడమే కాకుండా, వారి లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం (ఓవర్‌లోడింగ్) నేరమని, ఇది ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి డ్రైవర్ వాహనానికి సంబంధించిన పత్రాలను (=జ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్) ఎప్పుడూ వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని గుర్తు చేశారు. పాదచారుల రక్షణను విస్మరించవద్దని, సురక్షితమైన ప్రయాణాన్ని అందించడంలో ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. చట్టాన్ని గౌరవించి, క్రమశిక్షణతో వాహనాలు నడిపి బాచుపల్లి-నిజాంపేట్ ప్రాంతాన్ని ప్రమాద రహిత జోన్‌గా మార్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుగుణంగా వ్యవహరించాలి

**• రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 6:** ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సన్నాహక ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ స్పష్టం చేశారు. తుది ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఓటరు జాబితాపై జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా బీఎల్ఓలతో మ్యాపింగ్ ను పక్కాగా జరిపించాలని, అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా పూర్తి వివరాల పరిశీలన జరపాలని ఆదేశించారు. ఓటరు జాబితా రూపకల్పనలో ఎలాంటి తప్పిదాలు ఉండకూడదని, ఒత్తిళ్ళ, ప్రలోభాలకు లొంగకుండా పూర్తి పారదర్శకంగా జాబితా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితాలో బోగస్ ఓటర్లు ఉండరాదన్నారు. కొత్తగా విలీనం అయిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవిన్యూ కె. అనిల్ కుమార్, డిపిఓ హరి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సిపిఓ శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి మారినేని వెంకన్న, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సురేష్ నాయుడు, అజయ్, శ్యామ్, రాజమౌళి, బొమ్మ వెంకటేశ్వర్లు, ఫరీద్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకుల సహకారంతో నేరాల నియంత్రణ: జిల్లా ఎస్పీ శబరీష్

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 6:** బ్యాంకర్ల సహకారంతోనే నేరాలను నియంత్రించ వచ్చునని జిల్లా ఎస్పీ వైద్యులు శబరిష్ తెలిపారు. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, ఎటిఎం భద్రత, బ్యాంకు సెక్యూరిటీ కస్టమర్లకు అవగాహన అంశాలపై జిల్లా ఎస్పీ మంగళవారం జిల్లా కేంద్రం పట్టణ పోలీస్ స్టేషన్లోని సమావేశ మందిరంలో బ్యాంకు మేనేజర్లు, బ్యాంకు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూఇటీవలి కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఫేక్ కాల్స్, ఫిషింగ్ లింక్స్, క్యూఆర్ కోడ్ మోసాలు, ఆన్లైన్ లోన్ మరియు తక్షణ రుణాల (ఇన్స్టంట్ లోన్స్) పేరుతో జరుగుతున్న ఆర్థిక మోసాల నేపథ్యంలో బ్యాంకు ఉద్యోగులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకు ఉద్యోగులపై నిఘా (సర్వైలెన్స్), సున్నితమైన లావాదేవీల పర్యవేక్షణ మరింత కఠినంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో సైబర్ నేరాలకు సంబంధించి సైబర్ ప్రొఫైల్స్ తయారీ, పునరావృతంగా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా, బ్యాంకులుపోలీస్ శాఖ మధ్య సమన్వయంతో సమాచారం పంచుకోవడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనుమానాస్పద లావాదేవీలు గుర్తించిన వెంటనే సంబంధిత ఖాతాలను







తాత్కాలికంగా ఫ్రీజ్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని బ్యాంకు అధికారులకు సూచించారు.ఎటిఎం సెంటర్ల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎటిఎం వద్ద సరిపడా లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా తరచుగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అలాగే డోర్ లాకింగ్ సిస్టమ్, ఫైళ్ల భద్రత, బ్యాంకు లోపలి సెక్యూరిటీ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. బ్యాంకుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, సిబ్బందికి భద్రతా విధానాలపై (ఆలారం) స్పష్టమైన అవగాహన కల్పించాలని, విధుల్లో అప్రమత్తత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. బ్యాంకు పని వేళల్లోను, ఆఫీస్ ముగిసిన అనంతరం కూడా సెక్యూరిటీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కస్టమర్లు తమ ఏటిఎం పిన్, ఓటీపీ, సివివి, బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయకూడదని బ్యాంకులు తరచుగా అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని స్పష్టం చేశారు.సైబర్ మోసాలకు గురైన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్లైన్ నెంబర్ లేదా cyber-crime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ప్రజల ఆర్థిక భద్రత కోసం పోలీస్ శాఖ మరియు బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని, ఇలాంటి సమీక్ష సమావేశాలు భవిష్యత్తులో కూడా నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో డిఎస్పీ అడ్మిన్ గంద్రతి మోహన్, టౌన్ డిఎస్పీ తిరుపతిరావు, ఎస్.బి ఇన్స్పెక్టర్ నరేందర్, రూరల్ సీఐ సర్వయ్య, బయ్యారం సీఐ రవికుమార్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# చీకటిలో ఏన్కూర్ జంగాల కాలనీ





**తొలి అక్షరం/ఏన్కూర్ జనవరి 6:** ఏన్కూర్ మండల కేంద్రంలోని జంగాల కాలనీలో గత 30 సంవత్సరాలుగా నివసిస్తున్నటువంటి జంగాలు నేటికీ అంధకారంలోనే జీవిస్తున్నారు ఈరోజు సిపిఎం ఏన్కూరు మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రం వద్ద ఏన్కూర్ జంగాల కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఒక గంట పాటు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం ఏన్కూరు మండల కార్యదర్శి దంతమైన నాగేశ్వరరావు మాట్లాడారు గత 30 సంవత్సరాలుగా ఇక్కడ అనేక కుటుంబాలు జీవిస్తున్నప్పటికీ నేటికీ విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో మగ్గుతున్నారని దోమలు పాములు కాటుకు గురి అవుతూ ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ప్రభుత్వాలు వారికి విద్యుత్ సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే కాలనీవాసులకు విద్యుత్ సౌకర్యం కల్పించకపోతే ఏన్కూర్ లో ఉన్నటువంటి విద్యుత్ కేంద్రాన్ని ముట్టడిస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు కంప్యూటర్ యుగంలో కూడా గాఢాంధకారంలో ప్రజలు జీవిస్తా ఉంటే ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ పాలకులు చోద్యం చూస్తున్నారని ఆయన అన్నారు ఇక్కడ నివసిస్తున్నటువంటి ప్రజలు కడు నిరుపేదలని వీరి పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వహిస్తుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఏర్పుల రాములు ఇటికాల లేనిన్ భూక్య లక్ష్మ ఎం నరసరావు కే అంజి పి నరసరావు కే రాంబాబు కే గోపి రాములు వర్మ మహేష్ పెద్ద ముత్యం కుమార్ తదితరులు పాల్గొన్నారు

# సర్పంచులకు అండగా ఉంటా...

**ఫరూఖ్‌నగర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ర్యాకల శ్రీనివాస్ ఎన్నిక**

**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి06:** ఫరూఖ్‌నగర్ మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ గ్రామాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఫరూఖ్‌నగర్ మండల సర్పంచుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చించెడ్ గ్రామ సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్పంచుల సమాఖ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ర్యాకల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కమిటీలో ప్రధాన కార్యదర్శిగా మధూర్‌పూర్ గ్రామ సర్పంచ్ ఎల్. శివారెడ్డి, ఉపాధ్యక్షులుగా వెలి జర్ల ఆర్. బాబు నాయక్, షమీమ్ బేగం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ముడవత్ శ్రీను నాయక్, ఎంసీ ప్రవీణ్



కుమార్, కార్యదర్శులుగా రాజగోపాల్ రెడ్డి, రాజు నాయక్‌ను ఎంపిక చేశారు. అలాగే సహాయ కార్యదర్శులుగా ఆర్. మల్లేష్ గౌడ్, చక్కటి శివకుమార్ యాదవ్, ప్రచార కార్యదర్శులుగా శకుంతల ఆనంద్, వి. జంగయ్య, కోశాధికారిగా భవాని సుజాత మల్లేష్ ఎన్నికయ్యారు.ఎన్నికల అనంతరం ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ...మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులను కలుపుకుని పనిచేస్తూ, స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో సర్పంచులు గోటిక గోపాల్ రెడ్డి, ఎంసీ ప్రవీణ్ కుమార్, ఆర్. బాబు నాయక్,రవీందర్ రెడ్డి,నర్సమ్మ నర్సింహులు, లావణ్య రామకృష్ణ, మల్లేష్ గౌడ్, కుమ్మరి జ్యోతి శ్రీనివాస్, నవకీరాణి బుడ్డ నర్సింహులు, భూపాల్ యాదవ్, నత్తి శివరాములు, తేజ్యా నాయక్, రమేష్ నాయక్, యాదగిరి, శివకుమార్, షమీమ్ బేగం, జంగయ్య, శకుంతల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.అలాగే మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చల్ల శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు బాధేపల్లి సిద్ధార్థ్, తుపాకుల శేఖర్, శ్రీను నాయక్, రాయ్‌కల్ శ్రీనివాస్, జాంగారి రవి, హైదర్ ఘోరీ తదితరులు హాజరయ్యారు.

# గ్రామంలోని స్థానిక సర్పంచ్ ప్రసన్న రాబర్ట్, డాక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు

**తొలి అక్షరం/మాడుగులపల్లి/జనవరి 6:**మిర్యాలగూడ నియోజకవర్గం మాడుగులపల్లి మండల పరిధిలోని కుక్కడం మరియు చింతలగూడెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ మరియు పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గోపాలమిత్ర పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో 62 గేదెలకు పలు రకాల వ్యాధులని గుర్తించి వాటికి సంబంధించిన వైద్యాన్ని అందించారు. 40 దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించారు ,అదే విదంగా గొర్రెలు మరియు మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నకిరేకంటి ప్రసన్న రాబర్ట్, వార్డ్ మెంబర్లు వెంకన్న , ప్రాథమిక సహకార గొర్రెల సంఘం అధ్యక్షులు ఊరిబండి శ్రీనివాస్ యాదవ్, నల్గొండ జిల్లా పశుసంవర్ధక శాఖ సహాయసంచాలకులు డాక్టర్ జూలకంటి వెంక రెడ్డి, మాడుగులపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్,డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి,డాక్టర్ తులసి,జె వి వో శ్రీలత ,గోపాలమిత్ర సూపర్వైజర్ శివారెడ్డి, గోపాల మిత్రు పందిరి నరేందర్, సందీప్, శ్రీనివాస్ ,ఆఫీస్ సిబ్బంది జయమ్మ, రాకేష్, వినోద్ మరియు కుక్కడం గ్రామ రైతులు చింతలగూడెం రైతులు శ్రీకాంత్ రెడ్డి, శివ ,తదితరులు పాల్గొన్నారు.



# మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ధనుర్మాస సంకష్టహర చతుర్థి పూజ వేడుకలు





**ముఖ్య అతిథిగా షాద్ నగర్ కాంగ్రెస్ నాయకులు అగ్గనూరు బస్వం జగదేవి దంపతులు**

**ఈరోజు అన్నదాత మొగలిగిద్ద రాములు**

**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి06:**ధనుర్మాస సంకష్ట హర చతుర్థి పూజలు వినాయక గంజ్ గణపతి దేవాలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. తదనంతరం శివయ్యకు ప్రత్యేక పూజ అర్చన,అభిషేకం నిర్వహించారు. అనంతరం అగ్గనూరు బస్వం జగదేవి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈరోజు అన్నదానం మొగిలిగిద్ద రాములు. ఈ కార్యక్రమంలో సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మల సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ మాధురి నందకిషోర్, వన్నాడ వెంకటేష్ గౌడ్, మాజీ కో ఆప్షన్ నెంబర్ ఒగ్గు కిషోర్ జయలక్ష్మి దంపతులు, బిక్కు మల్ల శ్రీనివాస్, పినమోని గోపాల్, సుదీప్ జాదవ్ దంపతులు, ఆగిర్ కృష్ణయ్య దంపతులు, ఆర్ఐ ఓకేనా వెంకట్ రెడ్డి, గజవాడ నరసింహులు, శ్రీధర్, భరత్, మహావీర్, శేరి శ్రీనివాస్ రెడ్డి, పోకల శ్రీశైలం దంపతులు, విష్ణు సహస్ర పారాయణం భజన మండలి భక్తులు,ఆలయ ట్రస్ట్ సభ్యులు శంకర్ లాల్ లాహెూటి, కాకునూరి వెంకటేష్ గుప్తా, గోవింద్, ఆలయ పూజారి పండిట్ రాజన్ శాస్త్రి,విష్ణు శాస్త్రి, మహిళలు పాల్గొన్నారు.

# నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానం

**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 6:**ఆత్మకూరు మండలం రైకంపేట గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రజల విశ్వాసంతో ఘన విజయం సాధించిన నూతన సర్పంచ్, ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులను ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సన్మాన కార్యక్రమాన్ని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ప్రెసిడెంట్ పరిటాల రవి దంపతులు నిర్వహించి, నూతన ప్రజాప్రతినిధులకు శాలువాలు కప్పి ఘనంగా అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి మరియు గీత కార్మికుల సంక్షేమం దిశగా నూతన నాయకత్వం బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.గ్రామాభివృద్ధికి అందరూ కలిసి కృషి చేస్తూ, ప్రజా సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సంఘ నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఫామ్ కోసం కోహ్లీ గట్టిగా పోరాడాల్సింది

**● భారత మాజీ క్రికెటర్, కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్**

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి వైదొలగడంపై భారత మాజీ క్రికెటర్, కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ నిరాశ, విచారం వ్యక్తం చేశాడు. కింగ్ కోహ్లీ రెడ్ బాల్ ్రీర్‌కు ముందుగానే ముగింపు పలకడానికి బదులుగా, తన ఫామ్‌ను తిరిగి పొందడానికి మరింత గట్టిగా పోరాడాల్సిందని అభిప్రాయపడ్డాడు. ఫ్యాబ్ ఫోర్‌లోని జో రూట్, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్ వంటి బ్యాటర్లు టెస్టుల్లో రాణిస్తున్న సమయంలో కోహ్లీ ఆ ఫార్మాట్‌కు దూరం కావడం బాధగా ఉందన్నాడు. ఈ మేరకు టెస్టు క్రికెట్‌కు విరాట్ కోహ్లీ గుడ్ బై చెప్పడం గురించి తన అభిప్రాయాలను తెలియజేస్తూ ఇన్‌స్టాలో సంజయ్ మంజ్రేకర్ ఓ వీడియోను షేర్ చేశారు. టెస్టు క్రికెట్‌లో ఇంగ్లాండ్ ప్లేయర్ జో రూట్ రోజురోజుకు సరికొత్త శిఖరాలు అందుకుంటున్నాడని సంజయ్ మంజ్రేకర్ తెలిపాడు. ఈ నేపథ్యంలో తన మనసు మాత్రం విరాట్ కోహ్లీ వెంటే పరుగులు తీస్తోందన్నాడు. విరాట్ చాలా ముందుగానే టెస్టులకు గుడ్ బై చెప్పాడని అన్నాడు. రిటైర్ అవ్వడానికి ఐదేళ్ల ముందు నుంచి అతడు సరైన ఫామ్ లేక ఇబ్బంది పడ్డాడని గుర్తు చేసుకున్నాడు. అయినా సరే పట్టువీడకుండా ఆడాడని, గత ఐదేళ్లలో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ యావరేజ్ 31గా ఉందని వెల్లడించాడు. అలాంటపుడు తన లోపాలు సరిచేసుకుని ముందుకు సాగాల్సిందిపోయి టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ కావడం దురదృష్టకరమన్నాడు. జో రూట్, స్టీవ్ స్మిత్, కేన్ విలియమ్సన్ టెస్టు క్రికెట్‌లో మరింత గొప్పగా పేరు తెచ్చుకుంటూ ఉంటే కోహ్లీ మాత్రం ఇలా చేయడం విచారకరమని పేర్కొన్నాడు.



టాప్ ఆర్డర్ బ్యాటర్‌కు ఎంతో సులువైన వన్డే ఫార్మాట్లో మాత్రం విరాట్ కొనసాగుతున్నాడని, ఆ నిర్ణయం తనను తీవ్రంగా నిరాశపర్చిందని సంజయ్ మంజ్రేకర్ తెలిపాడు. ‹విరాట్ కోహ్లీ అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటిస్తే బాగుండేది. కానీ అతడు టాప్ ఆర్డర్ బ్యాటర్‌కు ఎంతో సులువైన వన్డేలలో మాత్రం కొనసాగాలనే నిర్ణయించుకున్నాడు. ఈ నిర్ణయం నన్ను నిరాశకు గురిచేసింది. టెస్టు, టీ20 క్రికెట్ ఈ రెండు బ్యాటర్‌కు భిన్నమైన సవాళ్లను ఇస్తాయి. టెస్టు క్రికెట్ ఓ ఆటగాడిని ఎల్లప్పుడూ పరీక్షస్తుంటుంది. కానీ కోహ్లీ దానినే వదిలేయడం గమనార్హం. బాగా ఫిట్‌గా ఉండి కూడా ఇంకొన్నాళ్లు పోరాడకుండా కోహ్లీ టెస్టు ఫార్మాట్‌ను వదిలిలేశాడు. ఒకవేళ కోహ్లీని ఒక సిరీస్ నుంచి తప్పిస్తే ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాల్సింది. ఆ తర్వాత మళ్లీ టెస్టుల్లోకి రీఎంట్రీ ఇవ్వడానికి ప్రయత్నించాల్సింది. అని సంజయ్ మంజ్రేకర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవలే టీమ్ఇండియా మాజీ ఆటగాడు నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. దేవుడు తనకు వరం ప్రసాదించి ఏదైనా కోరుకోమంటే కోహ్లీ తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకోని టెస్టు క్రికెట్ ఆడేలా చేయమని అడుగుతానని చెప్పాడు. 1.5 బిలియన్ల జనాభా ఉన్న దేశానికి ఇంతకంటే ఆనందాన్ని ఏదీ ఇవ్వదన్నాడు. 20 ఏళ్ల యువకుడిలా విరాట్ ఫిట్‌నెస్ ఉందని, అతడు 24 క్యారెట్ల గోల్డ్ అని కొనియాడాడు. ఈ మేరకు ఇన్‌స్టా పోస్టులో రాసుకొచ్చాడు.ప్రస్తుతం కింగ్ కోహ్లీ వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. టీ20, టెస్టు ఫార్మాట్లకు గుడ్ బై చెప్పేశాడు. కోహ్లీ 123 టెస్టు మ్యాచ్‌లలో (210 ఇన్నింగ్స్ లు) 30 శతకాలు, 31 హాఫ్ సెంచరీలతో 9230 పరుగులు చేశాడు. 2019 చివరి నాటికి కోహ్లీ బ్యాటింగ్ యావరేజ్ 54.97 ఉండగా, రిటైర్మెంట్ అయిననాటికి 46.85కి పడిపోయింది.గత ఐదేళ్లుగా టెస్ట్ క్రికెట్‌లో కోహ్లీ పేలవ ఫామ్‌తో సతమతమయ్యాడు. 2021 నుంచి విరాట్ తాను ఆడిన 39 టెస్టు మ్యాచ్‌లలో (69 ఇన్నింగ్స్ లు) 30.72 సగటుతో 2028 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, తొమ్మిది అర్ధ సెంచరీలు ఉన్నాయి. బౌలర్లు ఆఫ్ స్టంప్‌కు వెలుపల బంతులు వేసి కోహ్లీ బలహీనతను ఉపయోగించుకుని ఎక్కువసార్లు ఔట్ చేశారు. గత ఐదేళ్లలో కోహ్లీని ఎక్కువ సార్లు (5) ఆసీస్ పేసర్ స్కాట్ బోలాండ్ ఔట్ చేశాడు. ఆస్ట్రేలియాతో జరిగిన తన చివరి సిరీస్‌లో కోహ్లీ తొమ్మిది ఇన్నింగ్స్‌లలో కేవలం 190 పరుగులు మాత్రమే చేశాడు.

# బీసీసీఐకి నష్టమా లేక ఐసీసీకి నష్టమా..?




టీ20 వరల్డ్ కప్ 2026లో తమ మ్యాచ్‌లను భారత్‌కు వెలుపల నిర్వహించాలని బంగ్లాదేశ్ కోరుకుంటోంది. భద్రతా కారణాలను చూపుతూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తమ జట్టును భారత్‌కు పంపడానికి నిరాకరించింది. పాకిస్థాన్ మ్యాచ్‌లు ఇప్పటికే శ్రీలంకలో జరగనున్నాయి. ఇప్పుడు బంగ్లాదేశ్ మ్యాచ్‌లు కూడా ఆతిథ్య దేశమైన భారత్‌లో జరగకపోతే, బీసీసీఐకి ఏదైనా నష్టం జరుగుతుందా ముందుగా, టీ20 వరల్డ్ కప్ 2026 అనేది ఒక ఐసీసీ ఈవెంట్ అని అర్థం చేసుకోవడం ముఖ్యం. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే ఈవెంట్‌లో టిక్కెట్లు, స్పాన్సర్‌షిప్, బ్రాడ్‌కాస్ట్ నుంచి వచ్చే ఆదాయం నేరుగా బీసీసీఐకి వెళ్లదు, అది వరల్డ్ కప్ ఆతిథ్య దేశమైనప్పటికీ. ఈవెంట్ నుంచి వచ్చే ఆదాయాన్ని ఐసీసీ బిజినెస్ కార్పొరేషన్ చూసుకుంటుంది. ఆతిథ్య బోర్డు, అంటే బీసీసీఐ పాత్ర టీ20 వరల్డ్ కప్ నిర్వహణ, కార్యకలాపాల వరకు మాత్రమే పరిమితం అవుతుంది. టీ20 వరల్డ్ కప్ 2026 ద్వారా బీసీసీఐ ఆదాయం మ్యాచ్ డే సర్వీస్, స్పాన్సర్‌షిప్ నుంచి వస్తుంది. అందువల్ల, బంగ్లాదేశ్ మ్యాచ్‌లను భారత్‌కు వెలుపల షిఫ్ట్ చేస్తే, బీసీసీఐ ఆదాయంపై పెద్దగా ప్రభావం ఉండదు. బీసీసీఐకి నష్టం జరిగినా, అది మ్యాచ్ డే-ఎకనామిక్స్‌కు మాత్రమే పరిమితం అవుతుంది. టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ ఇప్పటికే విడుదలైనందున, ఆటగాళ్లు, కోచింగ్, ఇతర సహాయక సిబ్బందితో సహా ఇతర అధికారుల బస, విమాన బుకింగ్‌లు ముందే జరుగుతాయి. ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ మ్యాచ్‌లు కోల్‌కతా, ముంబైలో జరగాల్సి ఉంది. ఇప్పుడు బంగ్లాదేశ్ మ్యాచ్‌లు షిఫ్ట్ అయితే, అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఆటగాళ్లు, ఇతర సిబ్బందికి హోటల్ బుకింగ్, విమాన ప్రయాణం వంటి ఖర్చులను ఐసీసీ భరిస్తుంది. అందువల్ల, బంగ్లాదేశ్ మ్యాచ్‌లు భారత్‌కు వెలుపల షిఫ్ట్ అయితే, వారితో ఆడే జట్ల ఆటగాళ్లు కూడా వేరే వేదికలకు ప్రయాణించాల్సి ఉంటుంది. దీనివల్ల కొంతవరకు ఐసీసీ ఖర్చు పెరగవచ్చు, కానీ బీసీసీఐ లేదా ఆ దేశ క్రికెట్ బోర్డుకు కాదు. టీ20 వరల్డ్ కప్ 2026 ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం, బంగ్లాదేశ్ గ్రూప్ జిలో ఇంగ్లాండ్, ఇటలీ, నేపాల్, వెస్టిండీస్‌తో ఉంది. బంగ్లాదేశ్ తన మొదటి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న వెస్టిండీస్‌తో ఆడనుంది.

# 13 సిక్సర్లు 12 ఫోర్లతో అమన్ రావు విశ్వరూపం



హైదరాబాద్ ఓపెనర్ అమన్ రావ్ విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్‌పై డబుల్ సెంచరీ సాధించాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి సిక్సర్ కొట్టి తన 200 పరుగులు పూర్తి చేసుకున్నాడు. అమెరికాలో జన్మించిన అమన్ ఇప్పుడు భారత దేశవాళీ క్రికెట్‌లో దుమ్ము రేపుతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీ ప్రస్తుత ఎడిషన్‌లో గ్రూప్ స్టేజ్ ఆరో రౌండ్‌లో హైదరాబాద్ బెంగాల్‌తో తలపడింది. సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో బెంగాల్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. అమన్ రావ్, రాహుల్ సింగ్ హైదరాబాద్‌కు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. వీరిద్దరూ మొదటి వికెట్‌కు శతక (104) భాగస్వామ్యం నెలకొల్పారు. రాహుల్ 65 పరుగులు చేసి ఔటయ్యాడు. అమన్ ్ప్టెన్ తిలక్ వర్మతో కలిసి రెండో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. 38వ ఓవర్‌లో ఒక పరుగు తీసి 108 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఇది అమన్‌కు లిస్ట్ ఏ క్రికెట్‌లో మొదటి సెంచరీ. దీనిని పూర్తి చేసిన తర్వాత అతను దూకుడుగా బ్యాటింగ్ చేయడం ప్రారంభించాడు. తదుపరి 100 పరుగులు కేవలం 46 బంతుల్లోనే సాధించాడు. చివరి ఓవర్ నడుస్తున్నప్పుడు, అమన్ తన డబుల్ సెంచరీని పూర్తి చేయలేడేమో అనిపించింది. ఆకాష్‌దీప్ వేసిన చివరి ఓవర్‌లో, చివరి బంతికి ముందు అతను 194 పరుగులతో ఉన్నాడు. అప్పుడు సిక్సర్ కొట్టి తన డబుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అమన్ 154 బంతుల్లో 200 పరుగులు చేశాడు, ఇందులో 13 సిక్సర్లు, 12 ఫోర్లు ఉన్నాయి. అమన్ రావ్ జూన్ 2, 2004న మాడిసన్‌లో జన్మించాడు. మేడిసన్ అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రంలో ఒక నగరం. అమన్ ఐపిఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ జట్టులో కనిపించనున్నాడు. ఫ్రాంచైజీ అతన్ని ఆక్షన్లో అతని బేస్ ప్రైస్ 30 లక్షల రూపాయలకు కొనుగోలు చేసింది.అమన్ రావ్ క్రికెట్ ్రీర్ విషయానికొస్తే, అతను లిస్ట్ ఏలో 3 మ్యాచ్‌లలో 252 పరుగులు చేశాడు. 11 ɹ20 మ్యాచ్‌లలో 2 అర్ధశతకాలతో సహా 301 పరుగులు చేశాడు.

# మెంటార్‌గా మిథలీ రాజ్

ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగంలో, ముఖ్యంగా క్రికెట్‌లో సంచలన మార్పులు దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకునేలా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అడుగులు వేస్తోంది. విజయవాడ వేదికగా ఏసీఏ నూతన అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది. ఈ వేడుకే మార్పునకు సంకేతాలు ఇచ్చింది. ఏసీఏ అధ్యక్షుడు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, సెక్రటరీ సానా సతీష్ నేతృత్వంలో ఆంధ్ర క్రికెట్‌ను సమూలంగా ప్రక్షళన చేస్తూ అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులను తీసుక్లేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గతేడాది కాలంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టిందని కేశినేని చిన్ని తెలియజేశారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో మార్పులు కనిపిస్తున్నాయని చెప్పుకొచ్చారు. విశాఖ స్టేడియం పునరుద్ధరణ: ఆంధ్ర గడ్డపై అంతర్జాతీయ క్రికెట్‌కు చిరునామా అయిన విశాఖ స్టేడియాన్ని సరికొత్తగా తీర్చి దిద్దుతున్నారు. స్టేడియంలోని ఛైర్స్‌ను మార్చడంతోపాటు ప్రధాన మైదానం తరహాలోనే బి గ్రౌండ్‌ను కూడా అత్యాధునిక రెస్ట్ రూమ్స్, వసతులు కల్పించబోతున్నారు. మంగళగిరి స్పోర్ట్స్ సెంటర్: మంగళగిరి స్టేడియాన్ని కేవలం క్రికెట్ మైదానంగానే కాకుండా ఒక పూర్తి స్థాయి స్పోర్ట్స్ సెంటర్‌గా మార్చాలని ఏసీఏ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భవిష్యత్‌లో రాష్ట్ర క్రీడాకారులకు కేంద్ర బిందువుగా మారనుంది. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ ఏ స్థాయిలో శిక్షణ అందిస్తోందో, అదే తరహాలో మూలాడును అభివృద్ధి చేయబోతున్నట్టు చిన్ని వెల్లడించారు. రాయలసీమ అభివృద్ధి: కడప స్టేడియంలో గతంలో మౌలిక వసతుల కొరత ఉండేదని గుర్తించిన ఏసీఏ అక్కడ క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా గదులు నిర్మాణం చేపడుతోంది. ఆంధ్ర క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచే నిర్ణయం తీసుకుంది ఏసీఏ, మహిళా క్రికెట్ దిగ్గజం మిథలీరాజ్‌ను ఆంధ్ర మహిళా




క్రికెట్ జట్టుకు మెంటార్‌గా నియమించబోతున్నట్టు ఏసీఏ ప్రకటించింది. ఇది రాష్ట్రంలోని మహిళా క్రీడాకారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందనడంలో సందేహం లేదని అంటున్నారు. అంతే కాకుండా ఆంధ్ర రంజీ, సీనియర్ జట్లకు అంతర్జాతీయ కోచింగ్ అనుభవాన్ని అందించేందుకు న్యూజిలాండ్ మాజీ ఆటగాడు ప్రముఖ కోచ్ గ్యారీ స్టీడ్‌ను రంగంలోకి దించుతున్నారు. ఒక విదేశీ కోచ్ నేతృత్వంలో ఆంధ్ర క్రీడాకారులు శిక్షణ పొందడం వల్ల వారి టెక్నిక్ అంతర్జాతీయ స్థాయికి చేరుతుందని భావిస్తున్నారు. ఏసీఏ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గడిచిన ఏడాది కాలంలో అత్యధిక సంఖ్యలో అంతర్జాతీయ మ్యాల్‌లు నిర్వహించామన్నారు. ఉమెన్ వరల్డ్ కప్ మ్యాచ్‌ల నిర్వహణ ఏసీఏ సమర్థతకు నిదర్శనంగా చెప్పుకొచ్చారు. మహిళా క్రీడాకారులను గౌరవించే క్రమంలో స్టేడియం రెండు ప్రధాన ద్వారాలకు మహిళా క్రికెటర్ల పేర్లు పెట్టినట్టు గుర్తు చేశారు. త్వరలోనే రాష్ట్రంలో ఒక ప్రత్యేకమైన మహిళా క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. క్రికెట్ కేవలం నగరాలకే పరిమితం కాకుండా పల్లెటూళ్లకు కూడా విస్తరించాలని ఏసీఏ మరో ప్రోగ్రామ్ చేపట్టనుంది. రూరల్ టాలెంట్ సెర్చ్ పేరుతో కార్యక్రమం చేపట్టనుంది. వారికి ప్రత్యేక కోచింగ్ క్యాంపులు నిర్వహించనున్నారు.

# గిల్, సూర్య, యశస్వి జైస్వాల్ అట్టర్ ఫ్లాప్!

ప్రతిష్టాత్మక విజయ్ హజరే ట్రోఫీ 2025 టోర్నఅబశ్రీశ్రీలో బరిలోకి దిగిన భారత వన్డే ్ప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్, ఓపెనర్ యశస్వి జైస్వాల్ తీవ్రంగా నిరాశపర్చారు. మంగళవారం జరిగిన ఐదో రౌండ్ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌ల్లో పంజాబ్ తరఫున బరిలోకి దిగిన శుభ్‌మన్ గిల్.. 12 బంతుల్లో 11 పరుగులే చేసి వెనుదిరిగాడు. గోవాతో జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ తరఫున బరిలోకి దిగిన శుభ్‌మన్ గిల్.. తీవ్రంగా నిరాశపరిచాడు. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు అతని వైఫల్యం ఆందోళన కలిగిస్తోంది. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ అనంతరం శుభ్‌మన్ గిల్ ఒక్క చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లో మెడనొప్పికి గురైన అతను.., టీ20తో పాటు వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. విజయ్ హజారేతోనే రీఎంట్రీ ఇచ్చిన గిల్ తీవ్రంగా నిరాశపర్చాడు.హిమాచల్ ప్రదేశ్‌తో జైపూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై తరఫున బరిలోకి దిగిన యశస్వి జైస్వాల్(15), సూర్యకుమార్ యాదవ్(24) విఫలమయ్యారు. గాయం తర్వాత బరిలోకి దిగిన శ్రేయస్ అయ్యర్(82) మాత్రం టీ20 తరహా బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ముంబైకి సారథ్యం వహించిన అయ్యర్.. నాలుగో స్థానంలో బ్యాటింగ్ వచ్చి టీ20 తరహాలో ఆడాడు. 53 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 82 పరుగులతో రాణించాడు. క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగి తృటిలో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. వర్షం అంతరాయ కలిగించిన ఈ మ్యాచ్‌ను అంపైర్లు 33 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 33 ఓవర్లలో 9 వికెట్లకు 299 పరుగుల భారీ లక్ష్యాన్ని నమోదు చేసింది.



అయ్యర్‌తో పాటు ముషీర్ ఖాన్(51 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 73) హాఫ్ సెంచరీతో రాణించాడు. హైదరాబాద్ తరఫున బరిలోకి దిగిన మహమ్మద్ సిరాజ్(4/58) నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో నిప్పులు చెరిగాడు. ఈ మ్యాచ్‌లోనే మహమ్మద్ షమీ(3/70) మూడు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, గిల్, శ్రేయస్, జైస్వాల్.. బుధవారం బరోడాకు వెళ్లనున్నారు. న్యూజిలాండ్‌అబశ్రీశ్రీతో వన్డే సిరీస్ నేపథ్యంలో అక్కడ జట్టుతో చేరనున్నారు. న్యూజిలాండ్‌తో తొలి వన్డే జనవరి 11న వడోదర, రెండో వన్డే జనవరి 14న రాజ్‌కోట్ వేదికగా, మూడో వన్డే జనవరి 18న ఇండోర్‌లో జరగనుంది.




## రొమాంటిక్ కామెడీ జానర్‌లో నటించాలని ఉంది

**• నటి దీపికా పడుకొనె వెల్లడి**

తనకు రొమాంటిక్ కామెడీ చిత్రాల్లో నటించాలనుందని నటి దీపికా పదుకొణె చెప్పారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా కొంతమంది అభిమానులతో ముచ్చటించారు. రొమాంటిక్ కామెడీ చిత్రాల్లో నటించాలని ఉందని, కచ్చితంగా చేస్తాను. నాకు చాలా ఇష్టమైన జానర్‌లలో అదీ ఒకటి. ప్రేక్షకులు కూడా అలాంటి సినిమాలను ఇష్టపడతారు. నేను, నా టీమ్ కొన్నిరోజులుగా ఇలాంటి కథల కోసం వెతుకుతున్నాం. కానీ, ప్రస్తుతం ఈ రకమైన చిత్రాలకు మద్దతు ఇచ్చే నిర్మాతలు చాలా తక్కువ మంది ఉన్నారు. ఇవి రాసే రైటర్స్ కూడా తగ్గిపోయారని దీపిక అన్నారు. ఒకవేళ ఆ సినిమా చేస్తే.. అందులో హీరోగా ధురంధర్ (రణ్‌వీర్‌సింగ్) అయితే ఓకే అని సరదాగా బదులిచ్చారు.'ఓటీటీ వేదికగా అలాంటి చిత్రాల్లో నేను నటిస్తే మీరు బాధపడరు కదా' అని దీపికా అభిమానులను అడిగారు. దీంతో త్వరలోనే ఈ స్టార్ హీరోయిన్ ఓటీటీ ఎంట్రీ ఇవ్వనున్నారా.. అంటూ వార్తలు మొదలయ్యాయి. చివరిగా దీపిక 'కల్కి 2898ఏడీ'లో సుమతిగా కనిపించి ఆకట్టుకున్నారు. ప్రస్తుతం షారుక్ సరసన 'కింగ్'లో నటిస్తున్నారు. అలాగే అల్లు అర్జున్ హీరోగా అట్లీ తెరకెక్కిస్తున్న ప్రాజెక్ట్‌లోనూ లీడ్ రోల్‌లో సందడి చేయనున్నారు.



## నేనిప్పుడే పెళ్లి చేసుకోవడం లేదు

**• రూమర్స్‌కు చెక్ పెట్టిన మీనాక్షి చౌదరి**

'అనగనగా ఒక రాజు'తో ఈ సంక్రాంతికి అలరించడానికి సిద్ధమయ్యారు నటి మీనాక్షి చౌదరి . నవీన్ పొలిశెట్టితో కలిసి ఆమె నటించిన ఈ చిత్రం జనవరి 14న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మీనాక్షి తన పెళ్లంటూ వస్తోన్న రూమర్స్‌పై స్పందించారు. 'లక్కీ భాస్కర్' తర్వాత తల్లి పాత్రలు చేయడానికి మీకు ఆసక్తి లేదని చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి.. నిజమేనా' అనే ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. అసలు రూమర్స్ ఎలా సృష్టిస్తారో నాకు అర్థం కావట్లేదు. నేను అలాంటి కామెంట్స్ ఎక్కడా చేయలేదు. కథ, పాత్రకు ప్రాధాన్యమిస్తాను. కథ బాగుంటే ఎలాంటి పాత్రలోనైనా చేస్తాను. నేను పెళ్లి చేసుకోనున్నట్లు కూడా ఇటీవల ఎన్నో వార్తలు వచ్చాయి. అలాంటి రూమర్స్ విని నేను అలసిపోయాను. వాటిలో నిజం లేదు. నేను ఇప్పుడే పెళ్లి చేసుకోవడం లేదు' అని మీనాక్షి స్పష్టతనిచ్చారు. టాలీవుడ్ యంగ్ హీరోతో మీనాక్షి ప్రేమలో ఉన్నట్లు ఇటీవల జోరుగా ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని త్వరలోనే పెళ్లి చేసుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. ఇటీవల ఆమె టీమ్ ఈ రూమర్స్‌ను ఖండించినప్పటికీ ఇవి ఆగలేదు. ఇప్పుడు ఏకంగా మీనాక్షినే దీనిపై స్పష్టతనిచ్చి చెక్ పెట్టారు.




## టాక్సిస్‌లో రుక్మిణీ వసంత్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్‌దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో రుక్మిణి వసంత్ ఉన్నట్లు టీమ్ ప్రకటించింది. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మోడ్రన్ డ్రెస్‌లో పబ్‌లో నడుస్తూ రుక్మిణి కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌ల లుక్‌ను విడుదల చేశారు. ఇప్పుడు రుక్మిణి కూడా అందులో ఉన్నట్లు అధికారికమైంది. దీంతో ఇందులో నలుగురు హీరోయిన్స్ అయ్యారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్‌గా, నయనతార గంగ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

## ఉర్రూతలూగించేలా ప్రభాస్ నాచే.నాచే సాంగ్




రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ది రాజా సాబ్‌పై ప్రేక్షకుల్లో అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దర్శకుడు మారుతి హారర్ ఫాంటసీ జానర్‌లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండటంతో ప్రచార కార్యక్రమాలు వేగం పెంచాయి. ఇప్పటికే విడుదలైన 'రెబల్ సాబ్', 'సహనా సహనా' పాటలు, 'రాజే యువరాజే' మ్యూజిక్ బిట్ సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా విడుదలైన మరో స్పెషల్ సాంగ్ చర్చనీయాంశంగా మారింది.సోమవారం ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో 'నాచే నాచే' ఫుల్ వీడియో సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ పాట 1982లో మిథున్ చక్రవర్తి నటించిన డిస్కో డ్యాన్సర్ సినిమాలోని సూపర్ హిట్ నంబర్ కోయి యహాన్ నాచే'కు ఆధునిక రీమిక్స్‌గా రూపొందింది. అప్పట్లో బప్పీ లహరి అందించిన ఒరిజినల్ ట్యూన్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత అదే పాటను నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా కొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. తమన్ ఈ పాటకు ఎనర్జిటిక్ బీట్ ఇచ్చారు. నకాష్ అజీజ్, బృందా కలిసి ఈ పాటను ఆలపించారు. 'నాచే నాచే' పాటలో ప్రభాస్ తన స్టైలిష్ స్వాగ్‌తో పాటు డ్యాన్స్‌లోనూ కొత్త కోణాన్ని చూపించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ ముగ్గురూ గ్లామర్‌తో పాటు స్టెప్పుల విషయంలోనూ పోటీపడుతూ కనిపించారు. ప్రభాస్‌కు జోడీగా ముగ్గురు హీరోయిన్లు కనిపించడం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గ్రీస్‌లోని అందమైన లొకేషన్లలో భారీ స్థాయిలో షూట్ చేయడంతో పాట విజువల్స్ గ్రాండ్‌గా కనిపిస్తున్నాయి. కొత్త తరహా కాస్ట్యూమ్స్, స్టైలింగ్ కూడా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.ఈ పాటను హిందీ, తమిళ్ భాషల్లో విడుదల చేయగా, తెలుగు వెర్షన్‌ను ప్రత్యేకంగా రిలీజ్ చేయడం లేదని చిత్ర బృందం స్పష్టం చేసింది. తెలుగు ప్రేక్షకులు కూడా థియేటర్లలో హిందీ వెర్షన్‌లోనే ఈ పాటను చూడనున్నారు. ఈ నిర్ణయం సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. సంక్రాంతి రేసులో ప్రభాస్ ఈసారి ఎలాంటి మ్యాజిక్ చూపిస్తాడో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## తెలుగు తెరపై సంక్రాంతి సందడి

**• ఏకంగా ఐదు తెలుగు, రెండు డబ్బింగ్ సినిమాల విడుదల**

**• 7న మూవీ ట్రైలర్ల విడుదలకు సన్నాహాలు**




సంక్రాంతి సీజన్ వచ్చిందంటే టాలీవుడ్‌లో పోటీ మామూలుగా ఉండదు. ఈసారి ఆ పోటీ మరింత హాట్‌గా మారింది. మార్కెట్ ఉన్న స్టార్ హీరోలతో పాటు పరభాషా హీరోలు కూడా రంగంలోకి దిగుతుండటంతో థియేటర్లు సందడితో నిండబోతున్నాయి. జనవరి 9 నుంచి 14 మధ్య ఐదు భారీ సినిమాలు విడుదలకు సిద్ధమవుతుండగా, వాటి ప్రమోషన్లు కూడా అదే స్థాయిలో జోరుగా సాగుతున్నాయి. విజయ్, శివకార్తికేయన్ వంటి స్టార్ హీరోల సినిమాలు పక్క భాషల్లో విడుదలవుతుండగా, తెలుగులో 'ది రాజా సాబ్', 'మన శంకర వరప్రసాద్ గారు', 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 'అనగనగా ఒక రాజు', 'నారీ నారీ నడుమ మురారి' వంటి చిత్రాలు సంక్రాంతి బరిలో నిలిచాయి. ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించేందుకు ట్రైలర్లు, సాంగ్స్, గ్రాండ్ ఈవెంట్స్‌తో మేకర్స్ గట్టి ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ క్రమంలో జనవరి 7వ తేదీ టాలీవుడ్ క్యాలెండర్‌లో ప్రత్యేక రోజుగా మారింది. ఒకే రోజున నాలుగు పెద్ద ఈవెంట్లు జరగనున్నాయి. ఇది ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రమోషన్లలో భాగంగా రెండు ట్రైలర్ లాంచ్ ఈవెంట్స్, ఒక భారీ ప్రీ రిలీజ్ ఈవెంట్, మరో ప్రమోషనల్ ఈవెంట్ ఒకే రోజున ఎ÷-లాన్ చేయడం ఆసక్తికరంగా మారింది. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రానికి జనవరి 7న హైదరాబాద్‌లో ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. దీనికి 'మెగా విక్టరీ ప్రీ రిలీజ్ ఈవెంట్' అనే టైటిల్ పెట్టారు. వేదిక వివరాలు ఇంకా వెల్లడించకపోయినా, ఈ కార్యక్రమంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే రోజు సాయంత్రం 4.05 గంటలకు రవితేజ హీరోగా నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. అలాగే జనవరి 7 సాయంత్రం 6.04 గంటలకు నవీన్ పోలిశెట్టి నటించిన 'అనగనగా ఒక రాజు' ట్రైలర్ విడుదల కార్యక్రమం ప్లాన్ చేశారు. అంతేకాదు, ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్' సినిమా నుంచి కూడా అదే రోజు మరో ప్రమోషనల్ ఈవెంట్ ఉండొచ్చన్న ప్రచారం వినిపిస్తోంది. ఇలా ఒకే రోజున, అది కూడా కేవలం రెండు గంటల వ్యవధిలో రెండు ట్రైలర్ లాంచ్‌లు జరగడం, దానికి తోడు మెగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఉండటం ఇండస్ట్రీలో చర్చకు దారి తీస్తోంది. సంక్రాంతి బాక్సాఫీస్ పోటీలో ఎవరి వ్యూహం ఫలిస్తుందో, ఏ సినిమా జనాలను ఎక్కువగా ఆకట్టుకుంటుందో చూడాలి. జనవరి 7 తర్వాత టాలీవుడ్ హీట్ మరింత పెరగడం ఖాయమనే మాట వినిపిస్తోంది.